www.aakshitha.com
People's voice
అక్షిత
జాతీయ దినపత్రిక
AKSHITHA NATIONAL DAILY
తెలంగాణ దిక్సూచి
శనివారం | 11 | జూలై | 2026 | పేజీలు: 08

# ఉత్తమ ప్రతిభతో ఉజ్వల భవిత

## ప్రతి విద్యార్థి చదవడం, రాయడం, గణితంలో కనీస సామర్థ్యాలు పెంపొందించాలి

### జిల్లా కలెక్టర్ బి.సత్యప్రసాద్



**జగిత్యాల, అక్షిత బ్యూరో :** జగిత్యాల జిల్లాలోని ప్రభుత్వ ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల ఉపాధ్యాయులతో గురువారం జిల్లా కేంద్రంలోని విరూపాక్షి గార్డెన్స్‌లో 'ఫౌండేషనల్ లిటరసీ అండ్ న్యూమరసీ' కార్యక్రమంపై జిల్లా స్థాయి సమీక్ష సమావేశాన్ని జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ మాట్లాడుతూ జిల్లాలో విద్యార్థుల ఫలితాలను మరింత మెరుగుపరిచే లక్ష్యంతో ఫౌండేషనల్ లిటరసీ అండ్ న్యూమరసీ (ఎఫ్ఎల్ఎన్) అమలుపై నిర్వహించిన సమావేశంలో విద్యాశాఖ అధికారులు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులకు పలు కీలక ..మిగతా 2లో

# కష్టపడ్డోళ్ళకే పదవులు



## పదవులు అనేది బాధ్యత
## కొత్తకోట అంటేనే కాంగ్రెస్
## నన్ను ఎమ్మెల్యేను చేసింది కొత్తకోటనే
## సర్‌లో భాగస్వామ్యం కండి
## దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి
## సీడీసీ చైర్మన్ ప్రమాణ స్వీకారం



**వనపర్తి, అక్షిత ప్రతినిధి :** పదవులు అనేది బాధ్యతతో కూడుకున్నది, పార్టీ కొరకు కష్టపడ్డ ప్రతి ఒక్కరికి పదవులు వస్తాయని దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి అన్నారు. శుక్రవారం వనపర్తి జిల్లా కొత్తకోట మండలంలో శ్రీసాయి బంకెట్ హాల్లో ఉమ్మడి జిల్లా సీడీసీ చైర్మన్‌గా నియామకం అయిన గౌని చంద్రమోహన్ రెడ్డి ప్రమాణస్వీకారం కార్యక్రమానికి ..మిగతా 2లో

# భూసేకరణ ప్రక్రియను వేగవంతం చేయాలి

### కలెక్టర్ ఖుష్బూ గుప్తా



**మహబూబ్ నగర్, అక్షిత న్యూస్ :** జిల్లాలో జాతీయ రహదారులు, నీటి పారుదల ప్రాజెక్టులకు సంబంధించిన భూసేకరణ ప్రక్రియను వేగవంతం చేసి నిర్ణీత గడువులో పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ కార్యాలయం వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ (ఎన్‌హెచ్ఏఐ), రెవెన్యూ, నీటిపారుదల శాఖ అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా భూసేకరణ పురోగతిని పరిశీలించారు. సమావేశంలో భారత్‌మాల జాతీయ రహదారి ప్రాజెక్టుకు సంబంధించిన భూసేకరణ ..మిగతా 2లో

# ఎస్ఐఆర్ ప్రక్రియలో అలక్ష్యం చేయొద్దు

### జిల్లా కలెక్టర్ దీపక్ తివారీ



**వికారాబాద్, అక్షిత బ్యూరో :** ఎస్ఐఆర్ ప్రక్రియలో నిర్లక్ష్యం వహిస్తే సంబంధిత అధికారులపై కఠిన చర్యలు తప్పవని జిల్లా కలెక్టర్ దీపక్ తివారీ హెచ్చరించారు. ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియపై తహసిల్దార్లు ..మిగతా 2లో



# పక్కగా భూముల రీసర్వే

### జిల్లా కలెక్టర్ కె.హరిత

**ఆసిఫాబాద్, అక్షిత బ్యూరో:** జిల్లాలోని రెవెన్యూ నక్షాలు లేని గ్రామాలను గుర్తించి భూములను రీసర్వే చేసి గ్రామ నక్షాలు రూపొందించాలని జిల్లా కలెక్టర్ కె.హరిత అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేటు భవన సమావేశ మందిరంలో జిల్లా ఆదనపు ..మిగతా 2లో

## ఎస్ఐఆర్ ప్రక్రియలో అలక్ష్యం చేయొద్దు

**మొదటి పేజీ తరువాయి...**

ఎంపీడీఓలు, మున్సిపల్ కమిష నర్లతో  గూగుల్ మీట్ ద్వారా జిల్లా కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.... జిల్లాలో జూలై 20 లోపు డిజిటలైజేషన్ ప్రక్రియను తప్పనిసరిగా పూర్తి చేయాలన్నారు. జిల్లాలో ఇప్పటికీ 15 శాతం డిజిటలైజేషన్ ప్రక్రియ చేపట్టడం జరిగిందన్నారు.

ప్రతి రోజు తప్పని సరిగా 15 శాతం డిజిటలైజేషన్ చేపట్టాలని కలెక్టర్ తెలిపారు. ప్రతిరోజు 100 మంది ఓటర్లను డిజిటలైజేషన్ చేయాలని కలెక్టర్ ఆదేశించారు. గ్రామాల్లో ముందస్తుగా టామ్ టామ్ ద్వారా, చెత్త సేకరించే వాహనాల ద్వారా సమాచారాన్ని అందించి ప్రక్రియ వేగవంతం చేయాలని కలెక్టర్ సూచించారు. డిజిటలైజేషన్ తక్కువగా ఉన్న పోలింగ్ స్టేషన్లను జిల్లా అధికారులు సందర్శించి సమీక్షించాలని కలెక్టర్ ఆదేశించారు. ఐకెపి ఎపిఎం, ఫీల్డ్ అసిస్టెంట్లు, విఓఏ, రిసోర్స్ పర్సన్ ల సహకారం తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. ఏ ఒక్కరు ఓటు హక్కును కోల్పోకుండా చూడాల్సిన బాధ్యత మన అందరిపై ఉందని కలెక్టర్ తెలిపారు. శని, ఆదివారాల్లో పూర్తిస్థాయిలో ఎస్ఐఆర్ ప్రక్రియలో పాల్గొనాలని కలెక్టర్ తెలిపారు. 13వ తేదీ ఉదయం లోపు 45 శాతం డిజిటలైజేషన్ పూర్తి కావాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఎస్ఐఆర్ ప్రక్రియ పూర్తి అయ్యేంతవరకు అధికారులు సెలవుల్లో వెళ్ళడానికి వీలు లేదని జిల్లా కలెక్టర్ ఆదేశించారు.ఈ సమీక్షలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వెంకటాచారి, అసిస్టెంట్ కలెక్టర్ (ట్రైని) సచిన్ బస్వరాజ్ గుట్టూరు, డిఆర్ఓ స్వర్ణలత, జెడ్పి సీఈఓ సుధీర్, డిఆర్డిఓ శ్రీనివాస్, డిపిఓ జయసుధ, మెప్మా పీడీ రవి కుమార్, డిఎంహెచ్ఓ సుధాకర్ లాల్, డిడబ్ల్యూఓ కాంతారావు, హెచ్ సెక్షన్ సూపరింటెండెంట్ నెమత్ అలీ తదితరులు పాల్గొన్నారు.

## పక్కగా భూముల రీసర్వే

**మొదటి పేజీ తరువాయి...**

కలెక్టర్ (రెవెన్యూ) ఎం. డేవిడ్, ఆసిఫాబాద్ రాజస్వ మండల అధికారి లోకేశ్వర్ రావు, సర్వే ల్యాండ్ రికార్డ్ ఎ.డి. వినయ్ లతో కలిసి సర్వే శాఖ అధికారులతో భూముల రీ సర్వేపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో రెవెన్యూ నక్షాలు లేని గ్రామాలను గుర్తించడం జరిగిందని, భూముల రీసర్వే ద్వారా రైతులకు మేలు కలుగుతుందని, భవిష్యత్తులో ఎలాంటి వివాదాలు ఉండవని తెలిపారు. భూముల సర్వే నిర్వహించే ముందు గ్రామసభలు నిర్వహించి రైతులతో సమావేశం కావాలని, ప్రభుత్వ నిర్దేశించిన గడువులోగా సర్వే పనులు పక్కాగా నిర్వహించాలని, అవసరమైన పరికరాలు సమకూర్చుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల సర్వేయర్లు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## భూసేకరణ ప్రక్రియను వేగవంతం చేయాలి

**మొదటి పేజీ తరువాయి...**

పరిహారం చెల్లింపులు, మ్యూటేషన్, రహదారి నిర్మాణ పనుల పురోగతిపై అధికారులు కలెక్టర్‌కు వివరించారు. కొన్ని ప్రాంతాల్లో భూసేకరణ పూర్తయి రహదారి నిర్మాణం ముగిసిందని, మరికొన్ని సెక్షన్లలో భూసేకరణ, పరిహారం చెల్లింపులు, మ్యూటేషన్ ప్రక్రియ కొనసాగుతున్నట్లు తెలిపారు. భూత్పూర్ మండలంలోని కోడూరు--హస్నాపూర్ గ్రామాల పరిధిలో పెండింగ్‌లో ఉన్న భూసేకరణ పనులపై కూడా చర్చించారు. జాతీయ రహదారి నిర్మాణ పనులు ఎట్టి పరిస్థితుల్లోనూ ఆలస్యం కాకుండా భూసేకరణను వేగవంతం చేయాలని సూచించారు. జడ్చర్లలో జాతీయ రహదారి పక్కనున్న ఇన్‌స్పెక్షన్ బంగ్లా భూములకు సంబంధించిన అంశాన్ని కూడా సమావేశంలో చర్చించారు. మహాత్మా గాంధీ కల్వకుర్తి ఎత్తిపోతల పథకానికి సంబంధించి పెండింగ్లో ఉన్న భూసేకరణ పనులపై కూడా సమీక్షించారు. భూసేకరణకు సంబంధించిన చట్టపరమైన ప్రక్రియలు పూర్తయిన వెంటనే అవార్డులు జారీ చేయాలని, పెండింగ్ కేసులను త్వరితగతిన పరిష్కరించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ప్రతి రెండు మూడు రోజులకు ఒకసారి పురోగతిని సమీక్షిస్తూ నిర్ణీత గడువుల్లో పనులు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.

రాజీవ్ భీమా, కోయిల్‌సాగర్ ప్రాజెక్టులకు సంబంధించిన భూసేకరణలో ఉన్న సమస్యలను వెంటనే పరిశీలించి మిగిలిన భూసేకరణ పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.

# కష్టపడ్డోళ్ళకే పదవులు

**మొదటి పేజీ తరువాయి...**



ఆయన ముఖ్యతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కొత్తకోట అంటేనే కాంగ్రెస్, కాంగ్రెస్ అంటేనే కొత్తకోట,నేను ఎమ్మెల్యే కావడానికి కొత్తకోటనే కారణం అని అన్నారు. సర్ కార్యక్రమంలో ప్రతి ఒక్కరు భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. నియోజకవర్గంలో సర్ కార్యక్రమంలో కొత్తకోట వెనుకంజలో ఉందని ఇప్పటి వరకు కేవలం 19% శాతం మాత్రమే ఆన్లైన్ లో నమోదు అయిందని తెలిపారు. అందుకని ప్రతి ఒక్క నాయకులు సర్ కార్యక్రమం లో పాలుపంచుకోవాలని సూచించారు. పది సంవత్సరాలు అడ్డగోలుగా దోచుకున్నది చాలక పనికిమాలిన మాటలు బిఆరెస్ నాయకులు మాట్లాడుతున్నారని మండిపడ్డారు. కాళేశ్వరం



పేరుతో దోచుకున్నారని మండిపడ్డారు. 10 జన్మల ఎత్తిన బిఆరెస్ పార్టీ అధికారంలోకి రాదని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి పనులను ప్రచారం చెయ్యాల్సిన అవసరం ఎంతైనా ఉందని అన్నారు. కొత్తకోటలో ప్రభుత్వ బాలికల పాఠశాల భవనాన్ని నూతనంగా నిర్మించాం 15 వ తేదీన భవనాన్ని ప్రారంభిస్తామని తెలిపారు. దేవరకద్రలో కోర్టును ప్రారంభించుకున్నాం అలాగే డిగ్రీ కళాశాలను కూడా ప్రారంభించమని తెలిపారు. వచ్చే ఎన్నికల్లో 50 వేల మెజార్టీతో నేను గెలవబోతున్నామని తెలిపారు. ఉమ్మడి జిల్లాలో 14 నియోజకవర్గాలు కాంగ్రెస్ పార్టీ గెలవబోతుందని జోష్యం చెప్పారు. దేవరకద్ర నియోజకవర్గంలో రైతు భరోసా కింద 130 కోట్లు రైతుల ఖాతాలో జమ అయ్యాయని తెలిపారు. అనంతరం సీడీసీ చైర్మన్ చంద్రమోహన్ రెడ్డి మాట్లాడుతూ చెరుకు కంపెనీలో మా ప్రాంతం నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని కోరారు. అదేవిదంగా చెరుకు రైతులకు నష్టం జరగకుండా చూడాలని విజ్ఞప్తి చేశారు. దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి నియోజకవర్గంలో అనేక అభివృద్ధి పనులు చేస్తున్నారని వాటిని ప్రజల ముందుకు తీసుకెళ్లేందుకు ప్రతి కార్యకర్త పని చెయాలనీ సూచించారు. వచ్చే ఎన్నికల్లో దేవరకద్ర నియోజకవర్గంలో జీయంఆర్ ను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ముందస్తు అలోచన కలిగిన నాయకుడు మధుసూదన్ రెడ్డి అని అన్నారు. నాకు ఈ బాధ్యతలు అప్పగించిన ఎమ్మెల్యేకు, కాంగ్రెస్ నాయకులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. రైతులకు ప్రభుత్వానికి వారధిగా పని చేస్తానని చెప్పారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ పల్లెపాగు ప్రశాంత్, మున్సిపల్ వైస్ చైర్ పర్సన్ పల్లవి, కాంగ్రెస్ మండల అధ్యక్షులు బిచుపల్లి యాదవ్, పట్టణ అధ్యక్షులు పెంటన్న యాదవ్, మాజీ జడ్పీటీసీలు రావుల జితేంద్రనాథ్ రెడ్డి, బాబు, కౌన్సిలర్లు బోయోజ్, సుధా రెడ్డి, చంద్రకాంత్, సంజీవుడు, నాయకులు రావుల కరుణాకర్ రెడ్డి, మిషేక్, సుభాష్, వెంకటేష్, వెంకటేశ్వర్ రెడ్డి, నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ఉత్తమ ప్రతిభతో ఉజ్వల భవిత

**మొదటి పేజీ తరువాయి...**

సూచనలు చేశారు. పదో తరగతి చదువుతున్న కొంతమంది విద్యార్థులు కూడా కనీస అభ్యాస సామర్థ్యాలను సాధించలేకపోతున్న పరిస్థితి ఆందోళన కలిగిస్తోందని అన్నారు. ఈ పరిస్థితిని మార్చేందుకు ప్రాథమిక స్థాయి నుంచే ప్రతి విద్యార్థికి చదవడం, రాయడం, గణితంలోని చతుర్విధ ప్రక్రియలపై సంపూర్ణ పట్టు కల్పించడమే లక్ష్యంగా జిల్లా వ్యాప్తంగా ప్రత్యేక కార్యాచరణ రూపొందించినట్లు తెలిపారు.

జిల్లాలోని ప్రతి ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలకు మాసవారీ లక్ష్యాలను నిర్దేశించి, ప్రతి నెలా వాటి పురోగతిపై సమగ్ర సమీక్ష నిర్వహిస్తామని ఈ సందర్భంగా కలెక్టర్ తెలిపారు. ఉత్తమ ప్రగతి సాధించిన పాఠశాలల ఉపాధ్యాయులను ప్రతి నెలా అభినందించి ప్రోత్సహిస్తామని, తక్కువ ప్రగతి సాధించిన పాఠశాలల ఉపాధ్యాయులతో నేరుగా సమావేశమై సమస్యలను గుర్తించి, అభ్యాస ఫలితాలు మెరుగుపడేలా ప్రత్యేక చర్యలు చేపడతామని పేర్కొన్నారు.రాష్ట్ర స్థాయిలో జగిత్యాల జిల్లా పీజీఐలో ద్వితీయ స్థానం సాధించడం గర్వకారణమని, అయితే గత విజయాలతో సంతృప్తి చెందకుండా ఫలితాలను మరింత మెరుగుపరచేందుకు ప్రతి ఉపాధ్యాయుడు కృషి చేయాలని సూచించారు. ప్రతి విద్యార్థి గ్రేడ్‌కు తగిన చదువు సామర్థ్యాలను సాధించేలా కార్యాచరణ రూపొందించాలని తెలిపారు.



సింగిల్ టీచర్ పాఠశాలలు, మల్టీగ్రేడ్ తరగతులు, తక్కువ హాజరు, బోధనా సామగ్రి వినియోగంలో లోపాలు, రెమెడియల్ టీచింగ్ అవసరం వంటి సవాళ్లను గుర్తించి వాటిని సమిష్టిగా అధిగమించాలని సూచించారు. ప్రతి నెల ఎఫ్ఎల్ఎన్. లక్ష్యాలు నిర్దేశించుకుని, పాఠ్యపుస్తకాలు, టీచర్ హ్యాండ్‌బుక్, విద్యార్థుల వర్క్‌బుక్ మధ్య సమన్వయంతో బోధన సాగించాలని తెలిపారు.

బేస్‌లైన్, మిడ్‌లైన్, ఎండ్‌లైన్ అంచనాల ద్వారా విద్యార్థుల పురోగతిని నిరంతరం పరిశీలించి, అంచనాల ఫలితాలను కార్యాచరణ ప్రణాళికలుగా మార్చాలని సూచించారు. వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేక రెమెడియల్ బోధన అందించాలని పేర్కొన్నారు.

ఉపాధ్యాయులు నిరంతరం తమ బోధనా నైపుణ్యాలను మెరుగుపరుచుకోవాలని, సాంప్రదాయ బోధనకు బదులుగా భావనాత్మక, సృజనాత్మక, కార్యకలాపాల ఆధారిత, విద్యార్థి కేంద్రిత బోధనకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. ప్రతి నెల ఉత్తమ ఉపాధ్యాయులు, ఉత్తమ పాఠశాలలు, వినూత్న బోధనా విధానాలను గుర్తించి విద్యార్థులను ప్రోత్సహించాలని తెలిపారు.

పాఠశాల సముదాయాలను అకాడమిక్ లెర్నింగ్ కమ్యూనిటీలుగా అభివృద్ధి చేసి, ప్రధానోపాధ్యాయులు, ఎంఈవోలు, అకాడమిక్ బృందాలు నిరంతర పర్యవేక్షణ, మార్గదర్శకత్వం అందించాలని సూచించారు.

అలాగే, 100 శాతం లక్ష్యాలను సాధించిన పాఠశాలలను స్వయంగా సందర్శించి, ఆయా పాఠశాలల్లో అవసరమైన మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రత్యేకంగా నిధులు కేటాయిస్తామని వెల్లడించారు. విద్యార్థుల్లో కనీస అభ్యాస సామర్థ్యాల పెంపునకు ప్రతి ఉపాధ్యాయుడు బాధ్యతతో పనిచేయాలని, నాణ్యమైన బోధన ద్వారా జిల్లాను రాష్ట్రంలో ఆదర్శ జిల్లాగా నిలబెట్టాలని పిలుపు నిచ్చారు.ఈ సమావేశంలో జిల్లా విద్యాధికారి కె.రాము, ఏఎంఓ చంద్రశేఖర్ రెడ్డి, ఆర్పీలు అభయ్ రాజ్, విజయ్, జయంత్, ప్రవీణ్, మహేష్, ఉమేష్ మరియు తదితరులు పాల్గొన్నారు.

# గ్రామాల సమగ్ర అభివృద్ధికి పక్కా ప్రణాళికలు రూపొందించాలి

### సర్పంచులు ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టేలా పనిచేయాలి: అడిషనల్ కలెక్టర్ వెంకటేశ్వర్లు

### విబి-జి-రామ్-జి నిధులతో గ్రామాల్లో శాశ్వత అభివృద్ధి పనులకు ప్రాధాన్యత ఇవ్వాలి: డీఆర్డీఏ పీడీ విజయలక్ష్మి



**నిర్మల్ అక్షిత బ్యూరో, జూలై 10:** గ్రామ పంచాయతీల సమగ్ర అభివృద్ధికి పక్కా ప్రణాళికలు రూపొందించి అందుబాటులో ఉన్న ప్రభుత్వ నిధులను సద్వినియోగం చేసుకోవాలని నిర్మల్ జిల్లా అడిషనల్ కలెక్టర్(ఏ.సి.ఎల్.బి) వెంకటేశ్వర్లు సూచించారు. గ్రామ పంచాయతీ సమగ్ర అభివృద్ధి ప్రణాళికపై ముధోల్, తానూర్, బాసర సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులకు శిక్షణ కార్యక్రమాన్ని శుక్రవారం ముధోల్ మండలం తరోడ గ్రామంలోని రైతు వేదికలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అడిషనల్ కలెక్టర్ వెంకటేశ్వర్లు, డీఆర్డీఏ పీడీ విజయలక్ష్మి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా అడిషనల్ కలెక్టర్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. గ్రామాల అభివృద్ధి సర్పంచుల ప్రధాన బాధ్యత అని అన్నారు. సర్పంచులు తమ పదవీకాలంలో గ్రామ ప్రజల అవసరాలను గుర్తించి అభివృద్ధి పనులు చేపట్టి గ్రామ రూపురేఖలను మార్చేలా కృషి చేయాలని సూచించారు.

"ప్రజలు నమ్మకంతో అప్పగించిన బాధ్యతను సక్రమంగా నిర్వర్తించి గ్రామ అభివృద్ధికి కృషి చేస్తే ప్రజల్లో మంచి గుర్తింపు లభిస్తుంది. గ్రామానికి



అవసరమైన మౌలిక వసతులు, పారిశుద్ధ్యం, తాగునీరు, రోడ్లు తదితర అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలి" అని తెలిపారు.

గ్రామాభివృద్ధి పనుల్లో పారదర్శకత పాటిస్తూ ప్రజల భాగస్వామ్యంతో ప్రణాళికలు రూపొందించాలని, భవిష్యత్ అవసరాలను దృష్టిలో పెట్టుకొని అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాలని ఆయన సూచించారు.

**విబి--జి--రామ్--జి నిధులతో గ్రామాలకు కొత్త రూపు**

డీఆర్డీఏ పీడీ విజయలక్ష్మి మాట్లాడుతూ.. పంచాయతీరాజ్ చట్టం ప్రకారం గ్రామ పంచాయతీలకు వచ్చే నిధులను నిబంధనల ప్రకారం ప్రజా ప్రయోజనాల కోసం వినియోగించాలని వివరించారు.

కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న విబి--జి--రామ్--జి (విక్షిత్ భారత్ - గ్యారెంటీ ఫర్ రోజ్‌గార్ అండ్ అజీవికా మిషన్ - (గ్రామీణ్) పూజ్య బాపు గ్రామీణ రోజ్‌గార్ యోజన నిధులను గ్రామాల శాశ్వత అభివృద్ధికి వినియోగించుకోవాలని సూచించారు. ఈ పథకం ద్వారా గ్రామాల్లో వ్యవసాయ అభివృద్ధికి తోడ్పడే పనులు చేపట్టాలని, భూగర్భ జలాలు అందుబాటులో లేని ప్రాంతాల్లో రైతులకు ఉపయోగపడేలా వ్యవసాయ భూముల్లో నీటి బావుల తవ్వకాలకు ప్రాధాన్యత ఇవ్వాలని తెలిపారు.

అలాగే విబి--జి--రామ్--జి ద్వారా నర్సరీలు ఏర్పాటు చేసి పండ్ల తోటల పెంపకాన్ని ప్రోత్సహించాలని, ప్రతి రైతు పొలంలో కనీసం ఐదు మొక్కలు నాటేలా ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. దీంతో పర్యావరణ పరిరక్షణతో పాటు రైతులకు అదనపు ఆదాయం వచ్చే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు.

గ్రామాల్లో డ్రైనేజీలు, సీసీ రోడ్లు, పంచాయతీ భవనాలు, సెగ్రిగేషన్ షెడ్లు, పంట పొలాలకు వెళ్లే రహదారులు వంటి మౌలిక వసతుల పనులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిధులతో పాటు గ్రామ పంచాయతీ నిధులను సమన్వయం చేసుకొని చేపట్టాలని తెలిపారు.

గ్రామ సభల్లో తీర్మానాలు తీసుకొని ప్రాధాన్యత క్రమంలో అభివృద్ధి ప్రణాళికలు సిద్ధం చేసి పనులు అమలు చేయాలని సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులకు సూచించారు.

**బాసర గోదావరి పుష్కరాలకు ముందస్తు ఏర్పాట్లు**

బాసరలో జరగనున్న గోదావరి పుష్కరాల నేపథ్యంలో భక్తులకు అవసరమైన సౌకర్యాలు కల్పించేందుకు గ్రామ పంచాయతీలు ముందస్తు ప్రణాళికతో పనిచేయాలని డీఆర్డీఏ పీడీ విజయలక్ష్మి తెలిపారు. విబి--జి--రామ్--జి

పథకం ద్వారా తాత్కాలిక క్యాంటీన్లు, మరుగుదొడ్లు తదితర సౌకర్యాలు ఏర్పాటు చేసి భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ శిక్షణ కార్యక్రమంలో ముధోల్ ఎంపీడీవో, తానూర్ ఎంపీడీవో, బాసర ఎంపీడీవో, డీఎల్పీవోలు లక్ష్మణ్, లింగయ్య, సోన్ ఎంపీడీవో రామకృష్ణ, ఎంపీవోలు, పంచాయతీ కార్యదర్శులు, ఆయా గ్రామాల సర్పంచులు పాల్గొన్నారు.

# ప్రజా భద్రతే పోలీసుల ప్రధాన లక్ష్యం

### జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే





**రాజన్న సిరిసిల్ల అక్షిత బ్యూరో:** ప్రజల భద్రతకు అత్యున్నత ప్రాధాన్యత ఇస్తూ, పోలీస్ స్టేషన్ల పనితీరు, నేరాల దర్యాప్తు పురోగతి, ప్రజలకు అందిస్తున్న సేవలను నిరంతరం పర్యవేక్షణలో భాగంగా జిల్లా ఎస్పీ మహేష్ బి.గితే శుక్రవారం రోజున వీర్నపల్లి పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు.

ఈసందర్భంగా స్టేషన్ పరిధిలో నమోదైన కేసులు, పెండింగ్ కేసుల దర్యాప్తు పురోగతి, స్టేషన్ రికార్డుల నిర్వహణ, సిబ్బంది హాజరు, పెట్రోలింగ్ నిర్వహణ, రౌడీషీటర్లు, పాత నేరస్తులపై నిఘా తదితర అంశాలను క్షుణ్ణంగా సమీక్షించి, ప్రజలకు అందిస్తున్న పోలీసు సేవలపై ప్రత్యేకంగా ఆరా తీశారు. ప్రజా భద్రతే పోలీసుల ప్రధాన లక్ష్యంగా ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించాలని జిల్లా ఎస్పీ మహేష్ బి.గితే అధికారులకు సూచించారు. ప్రజల్లో భద్రతాభావాన్ని మరింత పెంపొందించేలా విజిబుల్ పోలీసింగ్‌ను సమర్థవంతంగా అమలు చేయడంతో పాటు రాత్రి వేళల్లో పెట్రోలింగ్‌ను మరింత బలోపేతం చేయాలని ఆదేశించారు.

ఆస్తి నేరాలు,చోరీలు,గంజాయి అక్రమ రవాణా, ఇతర అసాంఘిక కార్యకలాపాలపై నిరంతర నిఘా కొనసాగిస్తూ, అనుమానాస్పద వ్యక్తులు, వాహనాలపై క్రమం తప్పకుండా తనిఖీలు నిర్వహించాలని సూచించారు.

గ్రామాలను తరచూ సందర్శిస్తూ ప్రజలకు అందుబాటులో ఉంటూ పోలీసింగ్‌ను మరింత సమర్థవంతంగా అమలు చేయాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు.

శాంతి భద్రతల పరిరక్షణలో ప్రతి పోలీసు అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా వ్యవహరిస్తూ ప్రజల విశ్వాసాన్ని మరింత పెంపొందించేలా సేవలు అందించాలని , విధులలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే శాఖాపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు.

## మిషన్ భగీరథ మెయిన్ పైప్ లైన్ లీకేజ్

### చూసి చూడనట్టు వ్యవహరిస్తున్న మిషన్ భగీరథ అధికారులు

### ఇబ్బంది పడుతున్న వాహన చోదకులు బాటసారులు



**ఇటిక్యాల అక్షిత న్యూస్:** ఇటిక్యాల మండలం పరిధిలోని షాబాద్ గ్రామ సమీపంలోని షాబాద్ ఉదండాపురం రోడ్డు వెంబడి ఉన్న కల్వర్టు దగ్గర మిషన్ భగీరథ మెయిన్ పైప్లైన్ లీకేజ్ అయ్యి మంచినీరు వృధాగా గత వారం నుంచి మిషన్ భగీరథ నీళ్లు వృధాగా రోడ్డు వెంట పోతున్న కూడా సంబంధిత అధికారులు స్పందించడం లేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు.

ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి మిషన్ భగీరథ మెయిన్ పైప్ లైన్ లీకేజ్ పనులను పూర్తి చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

## మౌలిక వసతుల కల్పనకు నిరంతరం కృషి ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి



**ఉప్పల్ అక్షిత ప్రతినిధి, జులై 10:** ప్రజా అవసరాలకు అనుగుణంగా మరిన్ని మౌలిక వసతులు కల్పించేందుకు నిరంతరాయంగా కృషి చేస్తూనే ఉంటామని అన్నారు. శుక్రవారం మల్లాపూర్ డివిజన్ పరిధిలోని పాత మీర్పేట్ హెచ్‌బీ కాలనీ అన్నపూర్ణ కాలనీలో పంచముఖ హనుమాన్ ఆలయం నుంచి ఓల్డ్ మీర్పేట్ హనుమాన్ ఆలయం నిర్మించనున్న బాక్స్ డ్రైన్ పనులను ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ముఖ్యఅతిథిగా విచ్చేసి, మాజీ కార్పొరేటర్లు జేరిపోతుల ప్రభుదాస్, గుండారపు శ్రీనివాస్ రెడ్డిలతో కలిసి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాలనీలో పర్యటించి స్థానికులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. డ్రైనేజీ వ్యవస్థ, మంచినీటి సరఫరా, విద్యుత్ తీగల మార్పు వంటి సమస్యలపై సంబంధిత మున్సిపల్, జలమండలి, విద్యుత్ శాఖ అధికారులతో సమన్వయం చేసి త్వరితగతిన పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ బాక్స్ డ్రైన్ నిర్మాణం పూర్తయితే వర్షపు నీరు నిల్వ ఉండకుండా, డ్రైనేజీ నీరు రోడ్లపైకి రాకుండా నివారించడంతో పాటు స్థానిక ప్రజలకు దీర్ఘకాలిక ఉపశమనం లభిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జలమండలి డీజీఎం వేణుగోపాల్, వర్క్ ఇన్స్పెక్టర్ బిక్షపతి, కాలనీ అధ్యక్షుడు పాండాల నరసింహా గౌడ్, కార్యదర్శి సంజయ్ నాయక్, ఉల్లెం బాలరాజు, కృష్ణ, వాసు చారి, బోనాల శ్రీనివాస్, చంద్రశేఖర్ గౌడ్, రిజ్వాన్, అంజనీ ప్రసాద్, ప్రేమ్ సాగర్, స్వామి గౌడ్, శంకర్ గౌడ్, రాజలింగం, అజీజ్, కిట్టు, శేఖర్ గౌడ్, దండెం నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

## ఎస్ఐఆర్‌ను ప్రతి ఓటరు సద్వినియోగం చేసుకోవాలి



**కల్వకుర్తి అక్షిత ప్రతినిధి:** ప్రత్యేక ఓటరు జాబితా సవరణ ఎస్ ఐ ఆర్ కార్యక్రమాన్ని మున్సిపాలిటీ ప్రజలు తప్పనిసరిగా సద్వినియోగం చేసుకోవాలని కల్వకుర్తి మాజీ సర్పంచ్ బృంగి ఆనంద్ కుమార్ కోరారు. శుక్రవారం కల్వకుర్తి పట్టణంలోని 9,10,22వ వార్డులలో ఎస్ఐఆర్ కార్యక్రమాలను పరిశీలించా రు. అనంతరం పట్టణానికి చెంది పలువురికి సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణి చేశారు. 10వ వార్డులో ఇందిరమ్మ గృహ ప్రవే శ కార్యక్రమంలో పాల్గొన్నారు. కల్వకుర్తి పట్టణంలోని ప్రధాన రహదారులపై నూతన లైట్స్ పనులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి చీమ్ముల శ్రీకాంత్ రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ శానవాజ్ ఖాన్, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు పుస్తకాల రాహుల్, కౌన్సిలర్ లు ఎజస్, రాజేష్ కుమార్, చిత్తరి శ్రీనివాసులు, రమాకాంత్ రెడ్డి, చంద్ర కాంత్ రెడ్డి, గణేష్ యాదవ్, ఏయాఖాన్ తదితరులు ఉన్నారు

# ఘనంగా కేకే మహేందర్ రెడ్డి పుట్టినరోజు వేడుకలు



**రాజన్న సిరిసిల్ల అక్షిత బ్యూరో:** రాజన్న సిరిసిల్ల జిల్లాలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు కేకే మహేందర్ రెడ్డి జన్మదిన వేడుకలు శుక్రవారం కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు చొప్పదండి ప్రకాష్ ఆధ్వర్యంలో గాంధీ చౌక్ ప్రాంతంలో ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి, ఆసుపత్రిలో రోగులకు పండ్ల పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో కేకే మహేందర్ రెడ్డి కీలక పాత్ర పోషించారని, రాష్ట్ర ఏర్పాటుతో పాటు రాజన్న సిరిసిల్ల జిల్లా ఏర్పాటులో కూడా ఆయన కృషి ఎంతో ఉందన్నారు. పదవులపై వ్యామోహం లేకుండా ప్రజల మధ్య ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేసే నాయకుడిగా ఆయనకు ప్రత్యేక గుర్తింపు ఉందని పేర్కొన్నారు. కొంతమంది సోషల్ మీడియా, యుట్యూబ్ వేదికల ద్వారా వ్యక్తిగత విమర్శలు చేస్తున్నప్పటికీ ప్రజల్లో ఆయనకు ఉన్న ఆదరణ ఏమాత్రం తగ్గలేదన్నారు. పదవులు శాశ్వతం కావని, ప్రజలకు అందుబాటులో ఉండే నాయకత్వమే ముఖ్యమని వ్యాఖ్యానించారు. గత ఎన్నికల్లో ఓటమి చెందిన తర్వాత కూడా సిరిసిల్ల పద్మశాలి నేత కార్మికుల సమస్యలను కేకే మహేందర్ రెడ్డి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, సంబంధిత మంత్రులతో కలిసి బతుకమ్మ చీరల బకాయిల చెల్లింపుల కోసం కృషి చేసి నేత కార్మికులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకున్నారని పేర్కొన్నారు.

రాబోయే రోజుల్లో సిరిసిల్ల నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేసేందుకు కేకే మహేందర్ రెడ్డి నాయకత్వంలో కార్యకర్తలంతా ఐక్యంగా పనిచేయాలని పిలుపునిచ్చారు. రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని అత్యధిక మెజారిటీతో గెలిపించి సిరిసిల్లలో పార్టీ సత్తా చాటాలని కోరారు. అనంతరం కేకే మహేందర్ రెడ్డి పేరుతో రూపొందించిన ప్రత్యేక పాటను కాంగ్రెస్ నాయకులు విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు గడ్డం నరసయ్య, వైద్య శివప్రసాద్, మ్యాన ప్రసాద్, ఆడెపు చంద్రకళ, , యెల్లె లక్ష్మీనారాయణ, ఆకునూరు బాలరాజు, కల్లూరి చందన, సామల రోజా, వంగరి దేవదాస్, కార్యకర్తలు పాల్గొన్నారు.

# సరియైన పత్రాలు చూపించి వాహనాలను తీసుకెళ్లాలి

**కాజిపేట్ ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ పిట్టల.వెంకన్న**



**కాజిపేట్, అక్షిత ప్రతినిధి :** వరంగల్ కమిషనరేట్ పరిధిలోని కాజీపేట, వరంగల్ హన్మకొండ పట్టణ ప్రాంత ప్రజలు, కాజీపేట ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ నందు కరోనా కాలం నుండి వివిధ కారణాలతో జప్తు చేయబడినటువంటి ద్విచక్ర వాహనదారుల యజమానులకు వారి యొక్క ద్విచక్ర వాహనాలు ఏదైనా చిన్న చిన్న కారణాలతో జప్తు చేసి పోలీస్ స్టేషన్ నందు ఉంచిన యెడల, అట్టి వాహనాలకు సంబంధించిన సరియైన పత్రాలు చూపించి తీసుకొని వెళ్ళగలరని ట్రాఫిక్ పోలీసులు విజ్ఞప్తి చేశారు.

ఒకవేళ డ్రంకెన్ డ్రైవ్, డ్రైవింగ్ లైసెన్స్ లేని, పెండింగ్ చలాన్లు వంటి కేసులు పెండింగ్ లో ఉన్నట్లయితే అట్టి కేసులను త్వరితగతిన పరిష్కరించుకొని వాహనాలను తీసుకోనివెళ్లగలరని వానదారులకు సూచించారు.

కావున వరంగల్ ట్రై సిటీస్ పట్టణ ప్రజలు ఇట్టి విషయాన్ని గుర్తుంచుకొని , ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ పిట్టల.వెంకన్న ఒక ప్రకటనలో తెలిపారు .

# ఎప్పటి నుంచో ఓటరు జాబితాలో పేరు ఉంది కదా అని ధీమాలో ఉండొద్దు

**పూరించిన ఎన్యూమరేషన్ ఫారం జూలై 24 లోపు తిరిగి ఇవ్వకుంటే ఓటరు జాబితాలో పేరు తొలగించబడతాయి**

**బి.ఎల్.ఓ లు ఎన్యూమరేషన్ ఫారాలు తీసుకొని యుద్ధప్రాతిపదికన డిజిటలైజేషన్ చేయాలి**

**ఎస్.ఐ.ఆర్ పట్ల నిర్లక్ష్యం వహించే సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకుంటాం**

**జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి**



**వనపర్తి అక్షిత ప్రతినిధి :** జిల్లాలో ఉన్న ఓటర్లు ఇప్పటికే మా పేర్లు జాబితాలో ఎప్పటినుంచో ఉందని ఎన్యూమరేషన్ ఫారాలు ఇవ్వకుండా ఉంటే జాబితాలో ఓటరుగా పేరు తొలగించబడతాయని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఓటర్లను సూచించారు. శుక్రవారం తెలంగాణ రాష్ట్రంలో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ కొనసాగుతున్న ప్రక్రియ పై న్యూ ఢిల్లీ నుండి కేంద్ర ఎన్నికల కమిషన్ రాష్ట్రంలోని జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సమీక్షలో పాల్గొన్న కేంద్ర ఎన్నికల సంఘం డిప్యూటీ సెక్రెటరీ పవన్ కుమార్ శర్మ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో ఎస్.ఐ.ఆర్ గడువు జూలై 24 వరకు ఉందని, కానీ రాష్ట్రంలో ఇప్పటి వరకు 21.94 శాతం మాత్రమే డిజిటలైజేషన్ పూర్తి అయ్యిందని చెప్పారు. మిగిలిన 14 రోజులు యుద్ధప్రాతిపదికన కనీసం రోజుకు 6 శాతం పూర్తి చేయాల్సి ఉంటుందని కలెక్టర్లకు ఆదేశించారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా కలెక్టర్ అధికారులతో సమీక్ష నిర్వహిస్తూ వనపర్తి జిల్లాలో 22.01 శాతం మాత్రమే డిజిటలైజేషన్ పూర్తి అయ్యిందని, ముఖ్యంగా పట్టణ ప్రాంతాల్లో చాలా నెమ్మదిగా డిజిటలైజేషన్ జరుగుతుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. చాలా మంది ఓటర్లు తమ ఓటు ఇప్పటికే జాబితాలో ఉంది కదా అని ధీమాతో ఉన్నట్లున్నారని, కానీ ఎస్.ఐ.ఆర్ అనేది ఓటరు జాబితా తొలి నుంచి ప్రారంభం అవుతుందని ఇంతకు ముందు జాబితా పూర్తిగా రద్దైపోయి కొత్త జాబితా రూపొందించడం జరుగుతుందన్నారు. బి.ఎల్. ఒ ల ద్వారా ఇచ్చిన ఎన్యూమరేషన్ ఫారాలను తిరిగి బి.ఎల్.ఓ లకు ఇస్తే వాటిని మళ్ళీ డిజిటలైజేషన్ చేయాల్సి ఉన్నందున జిల్లాలోని ఓటర్లు వెంటనే ఫారాలను పూరించి వెంటనే తిరిగి ఇవ్వాలని ప్రజలను కోరారు. ఓటర్ల నుంచి తీసుకున్న ఫారాలన్ డిజిటలైజేషన్ చేయడానికి ఈరోజు నుండి ఒక్కో బి.ఎల్.ఓ వెంట ముగ్గురు వాలంటీర్లను నియమిస్తున్నట్లు తెలియజేశారు. పంచాయతీ సెక్రటరీలు, వార్డు ఆఫీసర్లు, అంగన్వాడీ టీచర్లు, ఆశా కార్యకర్తలు కంప్యూటర్ ఆపరేటర్లు అందరు ఎస్.ఐ.ఆర్ ప్రక్రియలో పాల్గొని ఒక్కో బి.ఎల్.ఓ నుంచి రోజుకు కనీసం 100 ఎన్యూమరేషన్ ఫారాలను డిజిటలైజేషన్ చేయాల్సి ఉంటుందని ఆదేశించారు. విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. వీడియో కాన్ఫరెన్స్ లో కేంద్ర ఎన్నికల కమిషన్ అధికారి నవీన్ కుమార్, రాష్ట్ర ఎలెక్టోరల్ అధికారి సుదర్శన్ రెడ్డి,జిల్లా అదనపు కలెక్టర్ లోకల్ బాడీస్ ఎన్ ఖీమ్యా నాయక్, అదనపు కలెక్టర్ రెవెన్యూ వినోద్ కుమార్, ఆర్డీఓ సుబ్రమణ్యం, సెక్షన్ సూపరింటెండెంట్ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

# సిరిసిల్లలో అవినీతి, బెదిరింపులు కొనసాగుతున్నాయంటూ బీజేపీ ఆరోపణలు

**బిజెపి పట్టణ అధ్యక్షుడు దుమాల శ్రీకాంత్**




**రాజన్న సిరిసిల్ల అక్షిత బ్యూరో:** సిరిసిల్లలో గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో జరిగిన అవినీతి, అక్రమాలు, ప్రజలపై ఒత్తిళ్లు ఇప్పటికీ కొనసాగుతున్నాయని బిజెపి పట్టణ అధ్యక్షుడు దుమాల శ్రీకాంత్ ఆరోపించారు. శుక్రవారం స్థానిక ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. మాజీ మంత్రి, సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్ కనుసన్నల్లోనే ఈ పరిణామాలు జరుగుతున్నాయని విమర్శించారు. మున్సిపాలిటీలో వైస్ చైర్మన్ సహా కొందరు ప్రజాప్రతినిధులపై ఇటీవల వచ్చిన ఆరోపణలను ప్రస్తావిస్తూ, ప్రజలను బెదిరించడం, సంక్షేమ పథకాల పేరుతో డబ్బులు డిమాండ్ చేయడం వంటి ఘటనలపై పోలీసులు వెంటనే స్పందించాలని వారు డిమాండ్ చేశారు. డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు, ఇందిరమ్మ ఇళ్ల వంటి పథకాల అమలులో అవినీతి జరుగుతోందన్న ఆరోపణలపై సమగ్ర విచారణ చేపట్టాలని కోరారు.

ఎన్నికల సమయంలో డబ్బులు పంచి ఓట్లు సాధించి, అనంతరం ప్రజలను ఇబ్బందులకు గురిచేయడం బీఆర్ఎస్ పాలనలో ఆనవాయితీగా మారిందని బీజేపీ నాయకులు ఆరోపించారు. ప్రజలు అన్ని విషయాలను గమనిస్తున్నారని, ఇకపై ప్రతి సమస్యపై ప్రశ్నిస్తామని స్పష్టం చేశారు. సిరిసిల్లలో జరుగుతున్న అక్రమాలు, ప్రజలపై బెదిరింపులపై పోలీసు యంత్రాంగం నిష్పక్షపాతంగా వ్యవహరించాలని కోరారు. ప్రజల సమస్యలపై బీజేపీ అండగా నిలుస్తుందని, అవసరమైతే ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. రానున్న రోజుల్లో వర్షాకాలంలో పట్టణంలోని అభివృద్ధి పనుల వాస్తవ పరిస్థితి ప్రజలకు స్పష్టంగా కనిపిస్తుందని పేర్కొంటూ, ప్రజలను మోసం చేసే రాజకీయాలకు ముగింపు పలకాలని బీఆర్ఎస్ నాయకులకు హెచ్చరిక జారీ చేశారు. ఈ సమావేశంలో బిజెపి నాయకులు పాల్గొన్నారు.

# జర్నలిస్టులకు పూర్తి ఉచిత బస్సు సౌకర్యం కల్పించాలి

**రాష్ట్రవ్యాప్తంగా ఆర్టీసీ అధికారులకు వినతి పత్రాలు సమర్పించిన టిడబ్ల్యూజేఎఫ్ జిల్లా కమిటీలు**



**వరంగల్, అక్షిత బ్యూరో:** తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో తెలంగాణ జర్నలిస్టులకు రాష్ట్రవ్యాప్తంగా ఉచిత బస్సు పాసులు అందించాలని గతం మాదిరిగా 1/3 చార్జెస్ లేకుండా పూర్తి ఉచితంగా జర్నలిస్టులకు అవకాశం కల్పించాలని కోరుతూ శుక్రవారం వరంగల్ రీజినల్ మేనేజర్ కార్యాలయంలో తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్, జిల్లా కమిటీ ఆధ్వర్యంలో వినతి పత్రం సమర్పించడం జరిగింది.

రాష్ట్రవ్యాప్తంగా ఉన్న మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం పంపిస్తున్నారు. అలాగే సంక్షేమ పథకాలు వివిధ వర్గాల వారికి అమలు చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం సమాజ హితం కోసం పనిచేస్తున్న జర్నలిస్టులకు వర్తిస్తాయి ఉచిత బస్సు ప్రయాణం కల్పించాలని వినతిపత్రంలో కోరారు.

ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు జక్కుల విజయ్ కుమార్, ప్రధాన కార్యదర్శి బొట్ల స్వామిదాస్, జాతీయ కౌన్సిల్ సభ్యులు బొడిగె మల్లేశం, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు డాక్టర్ పాలడుగుల సురేందర్, ఆడుప నర్సింగరావు, ఉపాధ్యక్షుడు వెల్ది రాజేందర్, సహాయ కార్యదర్శి రాంపల్లి శ్రీనివాస్, కమిటీ సభ్యులు పందేల శ్రీనివాస్, ఆకుల అశోక్, నాడెం యుగంధర్, ఉప్పు వెంకటేశ్వర్లు, గణిపాకా అనిల్, తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ 420 హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చింది

**నేడు ఇవ్వకుండా 420 పార్టీ గా మారింది**


**కాంగ్రెస్ కౌంట్ డౌన్ స్టార్ట్ అయింది**

**ఇక సమరమే**

**కరీంనగర్ అబివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం భారీగా నిధులు**



**కరీంనగర్ అక్షిత బ్యూరో:** కాంగ్రెస్ సర్కార్ కు కౌంట్ డౌన్ స్టార్ట్ అయిందని, ప్రభుత్వ వైఫల్యాలను ప్రజా క్షేత్రంలో ఎండగడతామని, ఆచరణ సాధ్యం కానీ 6 గ్యారంటీలు,420 హామీలతో ప్రజానీకాన్ని దగా చేసిన ఆ పార్టీనీ గద్దె దించే వరకు పోరాటం ఆపేది లేదని బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షులు, కరీంనగర్ ఇంచార్జి శాంతి కుమార్ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి స్పష్టం చేశారు. కరీంనగర్ జిల్లా బిజెపి విస్తృత సాయి సమావేశం శుక్రవారం గంగాధర మండల కేంద్రంలో జరిగింది. ఈ సమావేశానికి అధ్యక్షత వహించిన జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి, ముఖ్య అతిథి శాంతి కుమార్ లు మాట్లాడుతూ కేంద్రం లోని మోడీ ప్రభుత్వం అందిస్తున్న నిధులతోనే కరీంనగర్ దిశా దశ మారిందని , ముఖచిత్రం మారుతుందని తెలిపారు. ఈ సందర్భంగా బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి తాళ్లపల్లి శ్రీనివాస్ గౌడ్ రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలపై తీవ్ర నిరసన వ్యక్తం చేస్తూ కీలక తీర్మానాలను ప్రవేశపెట్టారు. అదే సమయంలో కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ జిల్లాకు అందిస్తున్న అభివృద్ధిపై హర్షం వ్యక్తం చేశారు. ఎన్నికల ముందు ఇచ్చిన 'ఆరు గ్యారంటీలు' అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని బీజేపీ ఆరోపించింది. 420 హామీలను నెరవేర్చని కాంగ్రెస్



పార్టీ నీ'420 పార్టీగా అభివర్ణించింది. రుణమాఫీలో స్పష్టత లేకపోవడం, రైతు భరోసా జాప్యం, నిరుద్యోగ భృతిని విస్మరించడం, మహిళలకు ఇచ్చిన హామీలపై మాట తప్పడం పట్ల కాంగ్రెస్ ప్రభుత్వం పై ఆగ్రహం వ్యక్తం చేసింది. జిల్లాలో ఇసుక మాఫియారాజ్యమేలుతోందని, కాంగ్రెస్ ప్రభుత్వ ప్రోద్బలంతోనే సామాన్యుడికి ఇసుక అందకుండా దోపిడీ జరుగుతోందని మండిపడ్డారు. వర్షాభావ పరిస్థితుల దృశ్య తాగు,నీటి సమస్యపై యుద్ధ ప్రాతిపదికన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఎన్నికల సందర్భంగా ప్రకటించిన ఆయా డిక్లరేషన్లను అటకెక్కించిందని ఘాటుగా విమర్శించారు.ఎస్టి, ఎస్సీ బీసీ సామాజిక వర్గాల సంక్షేమాన్ని విస్మరించిందన్నారు.

బి.ఆర్.ఎస్ - కాంగ్రెస్ దొందూ దొందేనని ,గత బి.ఆర్.ఎస్ పాలన మాదిరే, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం కూడా ప్రజలను మోసం చేస్తోందని, ఈ రెండు పార్టీల తీరు ఒక్కటేనని తేల్చిచెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు.

లిమోదీ 'వికసిత్ భారత్' లక్ష్యానికి మద్దతులి ప్రధాని మోదీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలు, మౌలిక సదుపాయాల కల్పన , అంతర్జాతీయ స్థాయిలో భారత్ ప్రతిష్టను పెంచిన విధానాన్ని సమావేశం కొనియాడింది. కరీంనగర్ అభివృద్ధిలో కేంద్ర ప్రభుత్వం, కేంద్ర మంత్రి బండి సంజయ్ కృషి,ప్రత్యేక చొరవతో కరీంనగర్ జిల్లా అభివృద్ధి పథంలో దూసుకుపోతోందని ,ముఖ్యంగా జగిత్యాల-కరీంనగర్, కరీంనగర్-వరంగల్ జాతీయ రహదారులు, సి ఆర్ ఎఫ్ ఫండ్స్ వినియోగం, కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ స్మార్ట్ సిటీ , అర్బన్ డెవలప్మెంట్ ఫండ్ ,గ్రామాల్లో ఈజీఎస్ నిధుల ద్వారా మారుతున్న జిల్లా ముఖ చిత్రంపై హర్షం వ్యక్తం చేశారు.రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చే వరకు పోరాటాన్ని కొనసాగిస్తామని, అదే సమయంలో కేంద్ర పథకాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లి 'వికసిత్ భారత్' లక్ష్య సాధనలో జిల్లాను ముందుంచేందుకు కృషి చేస్తామని కరీంనగర్ జిల్లా బీజేపీ శాఖ స్పష్టం చేసింది. బిజెపి జిల్లా శాఖ ప్రవేశపెట్టిన తీర్మానాన్ని మాజీ ఎమ్మెల్యే బోడిగే శోభ, రాష్ట్ర అధికార ప్రతినిధి , డిప్యూటీ మేయర్ సునీల్ రావు బలపరిచి మాట్లాడారు.. అనంతరం బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యకులు సింగిరెడ్డి కృష్ణారెడ్డి వ్యవసాయ తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. ఇట్టి తీర్మానాన్ని

మేయర్ కోలగాని శ్రీనివాస్ , జిల్లా ప్రధాన కార్యదర్శి బత్తుల లక్ష్మీనారాయణ బలపరచి. మాట్లాడారు. మేయర్ కోలగాని శ్రీనివాస్ మాట్లాడుతూ రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఓ ఫెయిల్యూర్ గవర్నమెంట్ అని ఘాటుగా విమర్శించారు. కరీంనగర్లో జరుగుతున్న అభివృద్ధి అంతా కేంద్ర మంత్రి బండి సంజయ్ కృషితో కేంద్ర ప్రభుత్వం నిధులు తోనే జరుగుతుందన్నారు. కింది స్థాయిలో నాయకులు కార్యకర్తలు అందరం కష్టపడి పని చేయాలని , రాబోయేది బిజెపి ప్రభుత్వమేనని ఆయన ధీమా వ్యక్తం చేస్తూ మాట్లాడారు. ఈ సమావేశంలో బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి మాడవెంకటరెడ్డి, పార్లమెంట్ కన్వీనర్, కార్పొరేటర్ బోయిన్పల్లి ప్రవీణ్ రావు, మాజీ ఎంపీపీ , కార్పొరేటర్ వాసాల రమేష్ , రాష్ట్ర నాయకులు ఇనుకొండ నాగేశ్వర్ రెడ్డి , లతో పాటు అపేక్షిత రాష్ట్ర, జిల్లా, మండల అధ్యక్షులు, మాజీ అధ్యక్షులు , వివిధ మోర్చా బాధ్యులు పాల్గొన్నారు.

# నిర్మల్ పట్టణంలో ట్రాఫిక్ సమస్యల నివారణకు ప్రత్యేక కార్యాచరణ

**జిల్లా ఎస్పీ డా. జి. జానకి షర్మిల, ఐపీఎస్**

**నిర్మల్, అక్షిత ప్రతినిధి :** నెల రోజుల పాటు ప్రత్యేక ట్రాఫిక్ డ్రైవ్ ప్రజల సహకారమే విజయానికి కీలకమని జిల్లా జిల్లా ఎస్పీ తెలిపారు.

నిర్మల్ పట్టణంలో రోజురోజుకూ పెరుగుతున్న ట్రాఫిక్ రద్దీని నియంత్రించి, ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపట్టేందుకు జిల్లా ఎస్పీ డా. జి. జానకి షర్మిల, ఐపీఎస్ ఈరోజు పట్టణంలోని బస్టాండ్ పరిసరాలు, మయూరి హోటల్ జంక్షన్, మంచిర్యాల చౌరస్తా, ఈద్గాహ్ చౌరస్తా ప్రాంతాల్లో ట్రాఫిక్ పరిస్థితులను పరిశీలించారు.

పరిశీలన అనంతరం జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు నిర్మల్ డీఎస్పీ శ్రీనివాస్ ఆధ్వర్యంలో ప్రత్యేక ట్రాఫిక్ నియంత్రణ బృందాన్ని ఏర్పాటు చేశారు. ఈ



బృందంలో టౌన్ ఇన్స్పెక్టర్ సమ్మయ్య, రూరల్ ఇన్స్పెక్టర్ కృష్ణ, ఆర్ఐలు రామ్నిరంజన్, రామకృష్ణతో పాటు ఎస్ఐలు, ఆర్ఎస్ఐలు మరియు ఇతర పోలీసు సిబ్బంది ఉంటారు.

ఈ ప్రత్యేక బృందం నెల రోజుల పాటు ప్రతిరోజూ ఉదయం, సాయంత్రం ట్రాఫిక్ రద్దీ అధికంగా ఉండే ప్రాంతాల్లో ప్రత్యేక డ్రైవ్లు నిర్వహించి ట్రాఫిక్ను క్రమబద్ధీకరించనుంది.

రోడ్లపై ఎక్కడపడితే అక్కడ ద్విచక్ర, నాలుగు చక్రాల వాహనాలను పార్కింగ్ చేయడం, రహదారులపై ఆక్రమణలు ట్రాఫిక్ సమస్యకు ప్రధాన కారణమని ఎస్పీ పేర్కొన్నారు. పండ్ల దుకాణాల యజమానులు, చిరు వ్యాపారులు, ఆటో స్టాండ్ నిర్వాహకులు, వాహనదారులు పోలీసులకు సహకరిస్తూ ట్రాఫిక్కు అంతరాయం కలగకుండా చూడాలని సూచించారు.

నిర్మల్ పట్టణానికి ప్రత్యేక ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ మంజూరైనప్పటికీ, పూర్తిస్థాయిలో ప్రారంభం కావడానికి కొంత సమయం పడుతుందని తెలిపారు. అప్పటి వరకు ప్రజలందరూ ట్రాఫిక్ నిబంధనలను పాటిస్తూ పోలీసు శాఖకు సహకరించాలని జిల్లా ఎస్పీ విజ్ఞప్తి చేశారు.

## ఈవీఎం గోడౌన్‌ను పరిశీలించిన జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్



**గద్వాల అక్షిత న్యూస్:** జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ సమీపంలో ఉన్న ఈవీఎం గోడౌన్ ను ఈవీఎంల నెలవారి సాధారణ తనిఖీలో భాగంగా శుక్రవారం కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ సందర్శించారు. ఈవీఎంలు,బ్యాలెట్ యంత్రాల విషయంలో అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు, సిబ్బందికి సూచించారు. ఈ తనిఖీలో అదనపు కలెక్టర్ మధు మోహన్,గద్వాల తహసీల్దార్ హరి కృష్ణ, ఎన్నికల విభాగం పర్యవేక్షకులు మంజుల, సంబంధిత ఎన్నికల విభాగం అధికారులు,సిబ్బంది,తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిసిన హనుమకొండ డీఎంహెచ్‌వో



**కాజీపేట్,అక్షిత ప్రతినిధి :** హనుమకొండ జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారిగా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన డా. అప్పయ్య , వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యులు నాయిని రాజేందర్ రెడ్డిని హనుమకొండ బాలసముద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు.

ఈ సందర్భంగా డీఎంహెచ్వో,ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డికి వెంకటేశ్వర ప్రతిమను అందజేసి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం జిల్లాలో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడం, ప్రభుత్వ ఆరోగ్య కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేయడం వంటి అంశాలపై వారు చర్చించారు.జిల్లా ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించడంలో విజయవంతంగా ముందుకు సాగాలని ఎమ్మెల్యే సూచించారు.

## గ్రామ సభల ద్వారా రీ-సర్వే పనులు వేగవంతం చేయాలి

**జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) బి.ఎస్.లత**




**జగిత్యాల అక్షితబ్యూరో:** జగిత్యాల జిల్లా బుగ్గారం మండలం గంగాపూర్ గ్రామంలో శుక్రవారం రోజున ఉదయం భూ భారతి - రీ సర్వే గ్రామ సభ నిర్వహించిన జిల్లా అదనపు కలెక్టర్ బి.ఎస్ లత. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వము ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన భూసర్వే-రీ సర్వే సందర్భంగా మల్యాల మండలంలోని సర్వాపూర్ గ్రామంలో భూముల రీ-సర్వేకు సంభందించిన అవగాహణ సదస్సు ( గ్రామ సభ) నిర్వహించారు.

భూమి రీ- సర్వే చేయుటలో చట్టం పరిదిలో వున్నా సర్వే అండ్ బౌండరి ఆక్ట్-1923 గురించి మరియు సర్వే కార్యాక్రమాల గురించి, సర్వే చేయు పని విదానాల గురించి ఇట్టి గ్రామ సభలో గ్రామ రైతులకు మరియు గ్రామ ప్రజలకు అవగాహణ కల్పించారు.

ఈ కార్యక్రమంలో భూమి కొలతల ఏ.డి కిషన్ ప్రసాద్, తహసీల్దార్, సంబంధిత అధికారులు మరియు తదితరులు పాల్గొన్నారు.

## మెదక్ పల్లి గ్రామంలోని 41వ బూత్‌లో ఎస్ఐఆర్ ప్రక్రియను పరిశీలన

### ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి



**కల్వకుర్తి అక్షిత ప్రతినిధి:** కల్వకుర్తి నియోజకవర్గం తలకొండ పల్లి మండలం మెదక్ పల్లి గ్రామం లోని 41 బూత్ లో ఎస్ ఐ ఆర్ ప్రక్రియను పరిశీలిస్తున్న స్థానిక శాసనసభ్యులు కసి రెడ్డి నారాయణ రెడ్డి ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ రమేష్,బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యట నరసింహ ముదిరాజ్, ఆమనగల్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ గూడూరు భాస్కర్ రెడ్డి తలకొండపల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కాసు శ్రీనివాస్ రెడ్డి, వీరన్న పల్లి సర్పంచ్ రామ్ లక్ష్మణ్,బి ఎల్ వో జయమ్మ బి.ఎల్.ఎ టి రాజు,బి ఎల్ ఏ సుప్రవైజర్ ఎం,ఏ,అజీజ్,బ్లాక్ కాంగ్రెస్ మహిళా అధ్యక్షురాలు లట్టుపల్లి రమాదేవి,నాయకులు ఏ,భగవాన్ రెడ్డి, కసిరెడ్డి విజేందర్ రెడ్డి,నరేందర్ గౌడ్,అవంచ నర్సింహారెడ్డి,మాజీ సర్పంచ్ కాడ మొని శ్రీశైలం ముదిరాజ్,మెరిగే గోపాల్ ముదిరాజ్,రాజేందర్ నాయక్, గ్రామ నాయకులు మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## ప్రాథమిక పాఠశాలకు స్మార్ట్ టీవీ బహుకరించిన గ్రామ సర్పంచ్



**పెద్దవంగర, అక్షిత బ్యూరో:** పెద్దవంగర మండల కేంద్రంలోని ఎక్స్‌రోడ్ వద్ద ఉన్న ఎంపీపీఎస్ (ప్రాథమిక) పాఠశాలకు పెద్దవంగర గ్రామ సర్పంచ్ ముద్దసాని పారిజాత సురేష్ రూ.15 వేల విలువైన స్మార్ట్ టీవీని బహుమతిగా అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, స్మార్ట్ టీవీ ద్వారా విద్యార్థులకు విద్యా సంబంధిత వీడియోలతో బోధించడం వల్ల పాఠ్యాంశాలు సులభంగా అర్థమవడంతో పాటు ఎక్కువకాలం గుర్తుండి, విద్యలో మరింత చురుకుదనం పెరుగుతుందని అన్నారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ఈ టీవీని పాఠశాలకు అందించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖాధికారి బి. శ్రీనివాస్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బి. సత్యనారాయణ, ఉప సర్పంచ్ అనపురం వినోద్, కాంగ్రెస్ మండల మాజీ అధ్యక్షుడు ముద్దసాని సురేష్, ఉపాధ్యాయురాలు ఎ. సౌభాగ్య, విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు. పాఠశాలకు విలువైన బహుమతిని అందించిన గ్రామ సర్పంచ్ ముద్దసాని పారిజాత సురేష్‌కు విద్యార్థుల తల్లిదండ్రులు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు.

## క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలి

### అదనపు కలెక్టర్ గడ్డం నగేష్



**రాజన్న సిరిసిల్ల, అక్షిత:** వేములవాడ మండలం అనుపురం సమీపంలో గురువారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాద క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని జిల్లా అదనపుకలెక్టర్ గడ్డం నగేష్ ఆదేశించారు. శుక్రవారం ఉదయం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి, వేములవాడ లోని ప్రభుత్వ ప్రాంతీయ ఆసుపత్రి లో చికిత్స పొందుతున్న క్షతగాత్రులను అదనపు కలెక్టర్ పరామర్శించారు. క్షతగాత్రుల ఆరోగ్య పరిస్థితులను, వారికి అందిస్తున్న చికిత్స గురించి అదనపు కలెక్టర్ సంబంధిత వైద్యులను అడిగి తెలుసుకున్నారు. వారికి మెరుగైన వైద్యంతో పాటు మందులు, భోజనం క్రమం తప్పకుండా అందించాలని, వారి పరిస్థితులను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని సూచించారు. బాధితులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రత్యేక శ్రద్ధ వహించాలని వైద్యులు, సిబ్బందిని అదనపు కలెక్టర్ ఆదేశించారు.కర్యక్రమం లో జిల్లా వైద్యాధికారి ఏంజెలినా అల్ఫ్రెడ్, ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి పర్యవేక్షకులు ప్రవీణ్, తహసీల్దార్ జయంత్, వైద్యులు, తదితరులు ఉన్నారు.

# మానసిక, శారీరక దృఢత్వాన్ని క్రీడల వల్ల సాధించవచ్చు

### జిల్లా ఎస్పి అశోక్ కుమార్ ఐపిఎస్‌లి

### అనునిత్యం విధులలో ఉండే పోలీసులకు వార్షిక క్రీడలు ఉల్లాసాన్ని కలిగిస్తాయి.

### అట్టహాసంగా ప్రారంభం అయినా 4వ వార్షిక జిల్లా పోలీసు క్రీడలు

### రెండు రోజుల పాటు కొనసాగనున్న క్రీడా పోటీలు

### వాలీబాల్, రన్నింగ్ పోటీలను ప్రారంభించి క్రీడాకారులను ఉత్సాహపరిచిన జిల్లా ఎస్పీ



**జగిత్యాల అక్షితబ్యూరో:** క్రీడలతో స్నేహ భావం పొందడంతో పాటు పని ఒత్తిడి నుండి రిలీఫ్ అవడానికి క్రీడలు ఎంతో దోహదపడుతాయని జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ ఐపీఎస్ తెలిపారు.

అనునిత్యం విధులలో, నిరంతరం పనిలో నిమగ్నమై ఉండే జిల్లా పోలీసులకు ఆటవిడుపుగా జిల్లా పోలీసు వార్షిక క్రీడలు నిర్వహించడం జరిగిందని అన్నారు. ఈ రోజు ఉదయం స్థానిక పోలీస్ హెడ్ క్వార్టర్స్ పరేడ్ మైదానం నందు జిల్లా ఎస్పీ పాల్గొని పోలీసు క్రీడలను ప్రారంభించారు. మొదటగా క్రీడలను ప్రారంభిస్తున్నట్లు జిల్లా ఎస్పి



తెలిపారు. తదుపరి పరేడ్ మైదానంలో పరేడ్ ను నిర్వహించి ముఖ్య అతిథులకు గౌరవ వందనాన్ని అందజేయడం జరిగింది. తదుపరి స్పోర్ట్స్ జెండాను అధికారుల సమక్షంలో ఎస్పి ఆవిష్కరించడం జరిగింది. స్పోర్ట్స్ ప్రారంభమైనట్లు తెలియజేస్తున్నటువంటి బెలూన్లను గాలిలోకి వదిలి జిల్లా పోలీసు వార్షిక క్రీడలను ప్రారంభించి క్రీడా జ్యోతిని వెలిగించారు. అనంతరం క్రీడాకారులచే ఎలాంటి రాగద్వేషాలు లేకుండా నిష్పక్షపాతంగా క్రీడలను ఆడతామని ప్రతిజ్ఞ చేశారు.

ఈ సందర్భంగా జిల్లా ఎస్పి మాట్లాడుతూ... మొదటగా క్రీడా పోటీలలో పాల్గొననున్న క్రీడాకారులందరికీ అభినందనలు తెలియజేస్తూ, క్రీడలు ఆడే స్ఫూర్తి గొప్పదని ప్రతి ఒక్కరూ క్రీడలను ఆడుతూ మానసిక శారీరక దృఢత్వాన్ని కాపాడుకోవాలని తెలియజేశారు. ఇలాంటి క్రీడా పోటీలలోనే ప్రతి ఒక్కరి ప్రతిభ కనబడుతుందని తెలియజేశారు. క్రీడలలో గెలుపోటములు సహజమని ప్రతి ఒక్కరు క్రీడా స్ఫూర్తితో పోటీలలో పాల్గొనవలసిందిగా తెలియజేశారు. ప్రతిరోజు విధులు నిర్వహించే అధికారులకు, సిబ్బందికి ఆటవిడుపుగా ఇలాంటి క్రీడా పోటీలు నిర్వహిస్తారని వాటిలో ప్రతి ఒక్కరూ పాల్గొని మానసిక ఉల్లాసాన్ని పొందవలసిందిగా తెలిపారు. ఇలాంటి క్రీడా పోటీల్లో పాల్గొనడం వల్ల ఉద్యోగుల మధ్య సఖ్యత పెరిగి, విధులలో కలిసిమెలిసి పనిచేస్తూ ఉండడం జరుగుతుందని తెలిపారు. తదుపరి రన్నింగ్, వాలీబాల్, క్రికెట్ క్రీడలను జిల్లా ఎస్పీ ఆడి క్రీడాకారులను ప్రోత్సహించి, ఉత్సాహ పరిచారు. ముఖ్యంగా ఈ క్రీడలు రెండు రోజుల పాటు నిర్వహించనున్నట్లు అందులో వాలీబాల్, క్రికెట్, కబడ్డీ, బ్యాడ్మింటన్, అథ్లెటిక్స్, క్యారం, చెస్ లాంటి వివిధ అంశాలలో ఈ క్రీడలను నిర్వహించనున్నట్లు తెలిపారు.

ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ చేతన్ నితిన్ ఐపీఎస్, డీఎస్పీ పురుషోత్తం రెడ్డి, రాములు, ఇన్‌స్పెక్టర్లు ఆరిఫ్ అలీ ఖాన్, సుధాకర్, కరుణాకర్, రాజకుమార్, లక్ష్మీనారాయణ, కిరణ్ కుమార్, సైదులు, వేణు, ఎస్.ఐ లు మరియు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# నీటి కొరత నేపథ్యంలో ఆరుతడి పంటల సాగే ఉత్తమ ప్రత్యామ్నాయం

### జిల్లా వ్యవసాయ శాఖ అధికారి వీరప్ప



**గద్వాల అక్షిత న్యూస్:** ఎల్‌నినో ప్రభావంతో ఖరీఫ్‌లో వర్షపాతం తగ్గే అవకాశం ఉన్నందున, రైతులు నీటి లభ్యతకు అనుగుణంగా ప్రత్యామ్నాయ పంటల సాగుపై దృష్టి సారించాలని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి వీరప్ప సూచించారు.

శుక్రవారం ఐడీఓసీ సముదాయంలోని జిల్లా వ్యవసాయం శాఖ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, జిల్లాలోని ప్రధాన సాగునీటి వనరులైన ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టు,నెట్టెంపాడు ఎత్తిపోతల పథకం, రాజోలిబండ డైవర్షన్ స్కీమ్ పరిధిలో నీటి నిల్వలు గణనీయంగా తగ్గిపోవడంతో రైతులు నీటి విని యోగంలో అత్యంత జాగ్రత్తలు పాటించాలని కోరారు.

వరి వంటి అధిక నీటి అవసరం ఉన్న పంటలకు బదులుగా పెసర, మినుము,కంది, జొన్న, సజ్జ, రాగులు,చిరుధాన్యాలు వంటి తక్కువ నీటి అవసరం ఉన్న ఆరుతడి పంటలను,ముఖ్యంగా స్వల్పకాలిక రకాలను సాగు చేయాలని ఆయన సూచించారు. అందుబాటులో ఉన్న నీటిని సమర్థవంతంగా వినియోగించేందుకు డ్రిప్ ఇరిగేషన్,స్ప్రింక్లర్ వంటి సూక్ష్మ సేద్య పద్ధతులను అనుసరించాలని,ఒకవేళ వరి సాగు తప్పనిసరి అయితే తడి--ఆరబెట్టే పద్ధతిని పాటించాలని ఆయన తెలిపారు.

భూమిలో తేమను ఎక్కువకాలం నిల్వ ఉంచేందుకు మల్చింగ్ చేయడంతో పాటు పశువుల ఎరువు,వర్మీ కంపోస్ట్, ఘన జీవామృతం వంటి సేంద్రియ ఎరువులను వినియోగించాలని ఆయన సూచించారు. ఎల్‌నినో ప్రభావంతో తెల్లదోమ,పేనుబంక,నల్లి వంటి చీడపీడల ఉధృతి పెరిగే అవకాశం ఉన్నందున రైతులు పొలాలను నిరంతరం పరిశీలిస్తూ నివారణ చర్యలు చేపట్టాలని,కలుపు మొక్కలను తొలగించి పొలాలను శుభ్రంగా ఉంచాలని ఆయన సూచించారు.సాగునీటి లభ్యత లేని ప్రాంతాల్లో రైతులు తక్కువ నీటితో పెరిగే పశుగ్రాస పంటలను సాగు చేయడంతో పాటు పాడి పరిశ్రమ,గొర్రెలు,మేకలుకోళ్ల పెంపకం వంటి అనుబంధ వ్యవసాయ రంగాల ద్వారా అదనపు ఆదాయం పొందాలని ఆయన సూచించారు.

వాతావరణ పరిస్థితులను ఎప్పటికప్పుడు గమనిస్తూ వ్యవసాయ శాఖ అధికారులు,శాస్త్రవేత్తల సూచనలకు అనుగుణంగా పంటల ప్రణాళిక రూపొందిస్తే నష్టాలను తగ్గించుకోవచ్చని ఆయన తెలిపారు.

ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టు డిప్యూటీ ఇంజనీర్ నాగేశ్వరరావు మాట్లాడుతూ 9.75 టీఎంసీల పూర్తి సామర్థ్యం ఉన్న జూరాల ప్రాజెక్టులో ప్రస్తుతం 5.729 టీఎంసీల స్థూల నీటి నిల్వ, 2.022 టీఎంసీల ప్రత్యక్ష (లైవ్) నీటి నిల్వ మాత్రమే ఉందన్నారు. అందుబాటులో ఉన్న ప్రత్యక్ష నీటిని తాగునీటి అవసరాలకే వినియోగించాల్సిన పరిస్థితి ఉందని,దీంతో జూరాల కుడి, ఎడమ ప్రధాన కాలువలు, నెట్టెంపాడు ఎత్తిపోతల పథకం, రాజోలిబండ డైవర్షన్ స్కీమ్‌ల ద్వారా ఈ ఖరీఫ్‌లో సాగునీటి సరఫరా ఉండదని నాగేశ్వరరావు తెలిపారు.

మొత్తం 3,89,700 ఎకరాల ఆయకట్టు ఉన్న రైతులు నీటి పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ముందస్తుగా ప్రత్యామ్నాయ పంటల సాగుకు ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని ఆయన సూచించారు.

ఈ సమావేశంలో ఇరిగేషన్ ఈఈ సంజీవ్ ప్రసాద్,సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

www.aakshitha.com People's voice అక్షిత AKSHITHA NATIONAL DAILY



# గడువులోగా వంద శాతం
# ఎస్.ఐ.ఆర్. ప్రక్రియ పూర్తి చేయాలి

**భారత ఎన్నికల కమిషన్ సీనియర్ సెక్రటరీ డాక్టర్ పవన్ కుమార్ శర్మ**

**ఎస్.ఐ.ఆర్ కార్యక్రమానికి కలెక్టర్లు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలి**

**డిజిటలైజేషన్ ప్రారంభించని బీఎల్వో లపై ప్రత్యేక దృష్టి సారించాలి**

**1,200 మందికి పైగా ఓటర్లు ఉన్న చోట కొత్త పోలింగ్ కేంద్రాల ప్రతిపాదనలు సిద్ధం చేయాలి**

**తదుపరి సమీక్ష నాటికి ప్రతి జిల్లాలో కనీసం 50 శాతం డిజిటలైజేషన్ పూర్తి చేయాలి : రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి**

**ఎస్ఐఆర్ కార్యక్రమంపై జిల్లా కలెక్టర్ల తో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించిన భారత ఎన్నికల కమిషన్ సీనియర్ సెక్రటరీ**



**జగిత్యాల అక్షితబ్యూరో:** ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్.ఐ ఆర్)–2026 కార్యక్రమం లో భాగంగా జూలై 24 నాటికి ఎన్యూమరేషన్ ఫారాల డిజిటలైజేషన్‌ను వంద శాతం పూర్తి చేయాలని భారత ఎన్నికల కమిషన్ సీనియర్ అధికారి డాక్టర్ పవన్ కుమార్ శర్మ జిల్లా కలెక్టర్లను ఆదేశించారు.

శుక్రవారం ఢిల్లీ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఎస్.ఐ.ఆర్ కార్యక్రమం పురోగతిని ఆయన సమీక్షించారు. హైదరాబాద్ నుంచి రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి పాల్గొనగా, జగిత్యాల సమీకృత జిల్లా కలెక్టరేట్ (ఐడీఓసీ) నుంచి జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు.

ఈ సందర్భంగా డాక్టర్ పవన్ కుమార్ శర్మ మాట్లాడుతూ, రాష్ట్రంలో ప్రస్తుతం కేవలం 22 శాతం ఎన్యూమరేషన్ ఫారాలు మాత్రమే డిజిటలైజ్ అయ్యాయని తెలిపారు. ఇప్పటికే గడువులో సగం సమయం పూర్తయిన నేపథ్యంలో మిగిలిన 14 రోజుల్లోనే డిజిటలైజేషన్‌ను వంద శాతం పూర్తి చేయాలని స్పష్టం చేశారు. ఇకపై ప్రతి రోజూ కనీసం 8 శాతం చొప్పున డిజిటలైజేషన్ జరిగేలా జిల్లా యంత్రాంగం చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

పంపిణీ చేసిన ప్రతి ఎన్యూమరేషన్ ఫారాన్ని తిరిగి ఓటర్ల నుంచి సేకరించి డిజిటలైజ్ చేయడం అధికారుల బాధ్యతేనని తెలిపారు. అనేక మంది బీఎల్‌వోలు ఇప్పటి వరకు ఒక్క ఫారాన్ని కూడా డిజిటలైజ్ చేయలేదని, అలాంటి బీఎల్‌వోలపై ప్రత్యేక దృష్టి సారించి వారి పనితీరును మెరుగుపర్చాలని ఆదేశించారు.

ఎస్ఐఆర్ కార్యక్రమానికి ఇతర కార్యక్రమాల కంటే అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలని జిల్లా కలెక్టర్లకు సూచించారు. ప్రతి రోజు యాదృచ్ఛికంగా ఐదుగురు బీఎల్‌వోలకు ఫోన్ చేసి వారి పురోగతిని తెలుసుకోవాలని, దీంతో పనిలో వేగం పెరుగు తుందని అన్నారు. పనితీరు బలహీనంగా ఉన్న బీఎల్‌వోలకు ఇతర అధికారులు, సూపర్‌వైజర్లు, వాలంటీర్ల ద్వారా అవసరమైన సహకారం అందించాలని సూచించారు.

పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణ (రేషనలైజేషన్)ను నిబంధనల ప్రకారం సమర్థవంతంగా చేపట్టాలని, 1,200 మందికి పైగా ఓటర్లు ఉన్న ప్రాంతాల్లో కొత్త పోలింగ్ కేంద్రాల ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆదేశించారు.

కొన్ని జిల్లాలు ఎస్ఐఆర్ కార్యక్రమంలో మంచి పురోగతి సాధిస్తున్నాయని పేర్కొంటూ నల్గొండ జిల్లా కలెక్టర్ పని తీరును అభినందించారు. ఇదే స్ఫూర్తితో అన్ని జిల్లాలు లక్ష్య సాధనలో ముందుండాలని ఆకాంక్షించారు.

రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ,లి రాష్ట్రవ్యాప్తంగా 99.6 శాతం మంది ఓటర్లకు ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీ పూర్తయిందని, ఇప్పటివరకు 21.94 శాతం డిజిటలైజేషన్ పూర్తయిందని తెలిపారు. వికారాబాద్, రంగారెడ్డి, సంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల్లో ఇంకా మూడు వేలకు పైగా ఎన్యూమరేషన్ ఫారాలు పంపిణీ చేయాల్సి ఉందన్నారు.

పట్టణ ప్రాంతాల్లో డిజిటలైజేషన్ శాతం తక్కువగా నమోదవుతోందని పేర్కొన్న ఆయన, తదుపరి సమీక్ష నాటికి ప్రతి జిల్లా కనీసం 50 శాతం డిజిటలైజేషన్ పూర్తి చేయాలని ఆదేశించారు. బీఎల్‌వోల వారీగా సమీక్షలు నిర్వహించాలని, ఎన్నికల నమోదు అధికారులు (ఈఆర్‌వోలు) సూపర్‌వైజర్లు, బీఎల్‌వోల పనితీరును నిరంతరం పర్యవేక్షిస్తూ లక్ష్య సాధనకు కృషి చేయాలని సూచించారు.

వీడియో కాన్ఫరెన్స్ అనంతరం లిజిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్‌లి జిల్లాలో ఎస్ఐఆర్ కార్యక్రమం పురోగతిని సంబంధిత అధికారులతో సమీక్షించారు. ఎన్యూమరేషన్ ఫారాల డిజిటలైజేషన్ ప్రక్రియను వేగవంతం చేసి నిర్దేశించిన గడువులోగా లక్ష్యాన్ని పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. బీఎల్‌వోల వారీగా ప్రతిరోజూ పురోగతిని పర్య వేక్షిస్తూ, పెండింగ్ పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని సూచించారు.

ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో ఆర్.డి.ఓ.లు మధుసూదన్, జీవాకర్ రెడ్డి , నరసింహారావు, తహసిల్దారులు, ఎన్నికల విభాగానికి చెందిన సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# సాంస్కృతిక వైభవాన్ని చాటిచెప్పిన
# "అల్ఫోర్స్" జూనియర్ కళాశాలల "విభావరి"





**కరీంనగర్ అక్షిత బ్యూరో:** విద్యార్థులు లక్ష్యాలను ఏర్పాటు చేసుకోవాలని, నిరంతరం కృషి చేయడం ద్వారా లక్ష్యాలను సాధించగలుగుతారని మరియు తల్లిదండ్రులకు ఖ్యాతిని తీసుకురాగలరని అల్ఫోర్స్ విద్యా సంస్థల అధినేత డాక్టర్ వి.నరేందర్ రెడ్డి కరీంనగర్ లోని శుభం గార్డెన్స్ లో అల్ఫోర్స్ జూనియర్ కళాశాలల "విభావరి" పేరుతో నిర్వహించినటువంటి సాంస్కృతిక కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరై వారు మాట్లాడారు.

ప్రారంభానికి ముందు వారు ప్రాంగణంలో ఏర్పాటు చేసినటువంటి సరస్వతి మాత విగ్రహానికి పూలమాలవేసి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ఘనంగా ప్రారంభించారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అల్ఫోర్స్ విద్యాసంస్థలు ఆరంభం నాటి నుండి అద్భుతమైన ఫలితాలు సాధిస్తున్నదని మరియు విద్యార్థులను ఉత్తమమైన స్థానాలలో స్థిరపరుస్తున్నదని గుర్తు చేశారు. ప్రతి ఒక్కరూ ప్రణాళిక బద్ధంగా కష్టపడాలని మరియు విజయాలను సాధించాలని తెలిపారు. ప్రతి సంవత్సరం లాగే ఈ సంవత్సరం కూడా ప్రతిష్టాత్మక విద్యాసంస్థల్లో అత్యధిక సీట్లు సాధించినదని హర్షం వ్యక్తం చేశారు.

2025 26 విద్యా సంవత్సరంలో అత్యుత్తమ ఫలితాలు సాధించినటువంటి విద్యార్థులకు ఘన సత్కారం చేశారు మరియు శుభాకాంక్షలు తెలిపారు. ప్రతి విద్యార్థి క్రమం తప్పకుండా తరగతి గదిలో నేర్చుకున్నటువంటి విషయాలను సమీక్షించుకోవాలని తద్వారా పట్టు సాధించగలుగుతారని వారు చెప్పారు.ఏ సమయంలో ఏ పరీక్షనైనా చాలా సులభం ఎదుర్కోవచ్చని మరియు విజయాలను నమోదు చేసి ఉత్తమమైన స్థానాలను కైవసం చేసుకోగలుగుతారని అభిప్రాయపడ్డారు. అదేవిధంగా తల్లిదండ్రుల ఆశయాల కనుగుణంగా ఆల్ఫోర్స్ విద్యాసంస్థలు ప్రణాళికలను రూపొందిస్తూ కార్పొరేట్ విద్యా సంస్థలకు అధిక అత్యుత్తమ ఫలితాలను నమోదు చేస్తూ చారిధ్యాత్మక అడుగులు అడుగులు వేస్తున్నదని మరియు అద్భుతమైన చరిత్రను నమోదు చేస్తున్నదని హర్షం వ్యక్తం చేస్తూ తల్లిదండ్రులను వారి యొక్క అమూల్యమైనటువంటి సహాయ సహకారాలను అందిస్తూ ఆల్ఫోర్స్ విద్యాసంస్థలను అగ్రగామిగా నిలపాలని కోరారు వేడుకల సందర్భంగా విద్యార్థులు ప్రద్రశించినటువంటి పలు సాంస్కృతిక కార్యక్రమాలు చాలా అలరింపచేసాయి.

ఈ కార్యక్రమంలో వివిధ కళాశాల ప్రిన్సిపాల్స్, అధ్యాపకులు, తల్లిదండ్రులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు

# ఎస్ఐఆర్‌ను ప్రతి ఓటరు సద్వినియోగం చేసుకోవాలి

**ప్రముఖ సంఘసేవకులు, అరవైశ్య రాష్ట్ర నాయకులు, కౌన్సిలర్ పాపిశెట్టి రాము**



**కల్వకుర్తి అక్షిత ప్రతినిధి:** ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమాన్ని ఆమనగల్ మున్సిపాలిటీ ప్రజలు తప్పనిసరిగా సద్వినియోగం చేసుకోవాలని ప్రముఖ సంఘ సేవకులు,అరవైశ్య రాష్ట్ర నాయకులు, 5వ వార్డు కౌన్సిలర్ పాపిశెట్టి రాము తెలిపారు ఓటు హక్కు ప్రతి పౌరుడికి రాజ్యాంగం కల్పించిన అత్యంత విలువైన ప్రజాస్వామ్య హక్కు అని, దానిని పరిరక్షించుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని ఆయన పేర్కొన్నారు. అర్హులైన ప్రతి వ్యక్తి తమ పేరు ఓటరు జాబితాలో నమోదు అయిందో లేదో తప్పనిసరిగా పరిశీలించుకోవాలని పేరు లేకపోతే వెంటనే నమోదు చేసుకోవాలని, బిఎల్ఎ, బిఎల్వోలతో,వివరాలు ఏవైనా తప్పులు ఉంటే సరిదిద్దుకు నేందుకు ఎస్ఐఆర్ ద్వారా ప్రభుత్వం కల్పించిన అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు. మున్సిపాలిటీ పరిధిలోని యువత, మహిళలు,వృద్ధులు,కొత్తగా 18 సంవత్సరాలు నిండిన అర్హులైన ఓటర్లు ప్రత్యేక శ్రద్ధ తీసుకుని తమ ఓటు హక్కును నమోదు చేసుకోవాలని కోరారు. ఓటరు జాబితాలో సరైన వివరాలు నమోదు కావడం వల్ల ఎన్నికల సమయంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తవని చెప్పారు ప్రజలు ఆధార్,గుర్తింపు,నివాస ధ్రువీకరణ వంటి అవసరమైన పత్రాలను తీసుకొని బిఎల్వోలు ఇచ్చిన ఫారమ్స్ ను 2002లో ఉన్నవారు మొదటి కాలంలో మొదటిసారి ఓటు హక్కు వచ్చినవారు రెండో కాలం యజమాని అడ్రస్ తోని నింపితే సరిపోతుందని తెలియజేశారు.

# గానుగమర్ల తండాలో లచ్చిరాం నాయక్ మృతి

**అండగా నిలిచి ఆర్థిక సహాయం అందించిన**

**రాధాకృష్ణ మెమోరియల్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ జర్పుల దశరథ్ నాయక్**

**గానుగు మరల తండా సర్పంచ్ సేవ్య నాయక్**



**కల్వకుర్తి అక్షిత ప్రతినిధి:** కడ్తాల్ మండల కేంద్రంలోని గానుగుమరల తండా గ్రామపంచాయతీ పరిధిలోని కానుగు భాయి తండకు చెందిన నేనావత్ లచ్చు నాయక్ నిన్న సాయంత్రం అనారోగ్యంతో బాధపడుతూ మరణించారు.ఈ విషయం గానుగుమరల తండా గ్రామ సర్పంచ్ సేవ్య నాయక్ ద్వారా తెలుసుకున్న కడ్తాల్ మాజీ జెడ్పీటిసి రాధాకృష్ణ మెమోరియల్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ లంబాడి హక్కుల పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షులు తన ట్రస్టు ద్వారా తక్షణ సాయంగా 5000 వేల రూపాయలను అలాగే గానుగు మరల తండా గ్రామపంచాయతీ సర్పంచ్ సేవ్య నాయక్10,000 వేలరూపాయలను నేనావత్ లచ్చు నాయక్ కుటుంబానికి అందించారు మృతదేహానికి పూలమాలలు వేసి ఘనమైన నివాళులు అర్పించి లచ్చు నాయక్ కుటుంబానికి ఎలాంటి సహాయ సహకారాలు కావాలన్నా అన్నివేళలా సహాయం చేయడానికి ముందుంటామని భరోసా కల్పించడం జరిగింది. ఈ సందర్భంగా నేనావత్ లచ్చు నాయక్ కుటుంబ సభ్యులు మాట్లాడుతూ ఆపదలో అపద్బాంధవుడులా మా కుటుంబానికి 15,000/- వేల రూపాయలను ఆర్థిక సహాయం చేసిన గొప్ప వ్యక్తులు కడ్తాల్ మాజీ జెడ్పీటిసి లంబాడి హక్కుల పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షులు రాధాకృష్ణ మెమోరియల్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ జర్పుల దశరథ్ నాయక్. అలాగే స్థానిక సర్పంచ్ సేవ్య నాయక్ కి కృతజ్ఞతలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు భిక్య నాయక్ మాజీ ఉపసర్పంచ్ శారదా పాండు నాయక్ వార్డు సభ్యులు శ్రీను నాయక్ చాంది లక్ష్మణ్ నాయక్ నాగార్జున నాయక్ గ్రామ కమిటీ అధ్యక్షుడు పాండు నాయక్ మాజీ వార్డు సభ్యులు భీమన్ నాయకులు పాండు కిషన్ నర్సింగ్ సక్రు రాజు హరి మహేష్ లక్ష్మణ్ జాన్యా కుమార్ భీమన్ శంకర్ దేవుల రాజు శ్రీను రవి రెడ్యా చందర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# పోలీస్ స్టేషన్ లోనే నిరాహార దీక్షకు “పాలమూరు” శ్రీకారం

**“డంపింగ్ యార్డ్” రద్దు అయ్యే వరకు మా పోరాటం ఆగదు**

**నిరవధిక నిరాహార దీక్షకు ప్రకటన**

**బిజెపి నేత పాలమూరు విష్ణువర్ధన్ రెడ్డి సంచలన నిర్ణయం**

**విష్ణువర్ధన్ రెడ్డి అరెస్ట్ తరువాత కీలక నిర్ణయం**

**డంపింగ్ యార్డ్ రద్దు వరకు రిలే నిరాహార దీక్షలకు సిద్ధం కావాలని పిలుపు**



**షాద్ నగర్, అక్షిత ప్రతినిధి:** సిద్ధాపూర్ డంపింగ్ యార్డ్ ప్రాంతాన్ని సందర్శించేందుకు వెళ్తున్న మహిళలను పోలీసులు అడ్డుకోవడాన్ని ప్రశ్నిస్తూ నిరసన వ్యక్తం చేసిన విష్ణువర్ధన్ రెడ్డిని పోలీసులు శుక్రవారం అరెస్ట్ చేసి కొత్తూర్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ అరెస్ట్‌కు నిరసనగా, సిద్ధాపూర్ ప్రజల న్యాయమైన డిమాండ్ నెరవేరే వరకు ఉద్యమాన్ని మరింత ఉధృతం చేయనున్నట్లు విష్ణువర్ధన్ రెడ్డి ప్రకటించారు. అంతేకాదు ఈ అరెస్టు నిరసిస్తూ ప్రభుత్వ దాష్టిక చర్యలను ప్రశ్నిస్తూ ఇకపై నిరవధిక రిలే నిరాహార దీక్షలను కానీ స్వయంగా చేపడుతున్నట్లు సంచలన నిర్ణయం ప్రకటించారు. అంతేకాదు పోలీసులు అరెస్టు చేయడంతో కొత్తూరు పోలీస్ స్టేషన్ లోనే ఈ నిర్ణయం తీసుకొని అక్కడే నిరాహార దీక్షకు నేటి నుండి శ్రీకారం చుట్టడం గమనార్హం. అసలేం జరిగిందంటే శుక్రవారం జవహర్ నగర్ వెళ్లేందుకు మహిళలతో బిజెపి సీనియర్ నేత పాలమూరు విష్ణువర్ధన్ రెడ్డి సిద్ధమయ్యారు. అయితే ఈ విషయం తెలుసుకున్న పోలీసులు ముందస్తు చర్యగా వారందరినీ అదుపులోకి తీసుకున్నారు. పాలమూరు విష్ణువర్ధన్ రెడ్డిని పోలీసు వాహనంలో కొత్తూరు పోలీస్ స్టేషన్ కు తరలించారు. దీంతో తీవ్ర ఆందోళన గురైన పాలమూరు విష్ణువర్ధన్ రెడ్డి ప్రభుత్వ పోలీసు చర్యలను నిరసిస్తూ నిరవధిక రిలే నిరాహార దీక్షలను చేపడుతున్నట్లు పోలీస్ స్టేషన్ లో ప్రకటించారు. ఈరోజునుండే తన దీక్ష ప్రారంభం అవుతుందని సమస్య పరిష్కారమయ్యే వరకు నిరాహార దీక్ష చేస్తానని విష్ణువర్ధన్ రెడ్డి తన సంచలన నిర్ణయాన్ని ప్రకటించారు.

నేటి ఉద్యమం ముగిసేంత వరకు ప్రతిరోజూ రిలే నిరవధిక నిరాహార దీక్షతో పాటు శాంతియుత, రాజ్యాంగబద్ధ ప్రజా పోరాటాన్ని కొనసాగిస్తామని తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, “డంపింగ్ యార్డ్ రద్దు అయ్యే వరకు మా పోరాటం ఆగదన్నారు. ప్రజల హక్కుల పరిరక్షణ కోసం శాంతియుతంగా, రాజ్యాంగబద్ధంగా ఉద్యమాన్ని కొనసాగిస్తాం” అని స్పష్టం చేశారు. సిద్ధాపూర్ ప్రజల న్యాయమైన డిమాండ్ నెరవేరే వరకు పోరాటం కొనసాగుతుందని ఉద్యమ నాయకులు తెలిపారు. జై సిద్ధాపూర్.. డంపింగ్ యార్డ్ రద్దు చేయాలి అనే నినాదంతో ముందుకు సాగుతున్నట్లు తెలిపారు..

## ఆదర్శవంతమైన నగరంగా వరంగల్ తీర్చిదిద్దడమే లక్ష్యం..

**నిర్ణీత గడువులోగా పనులు పూర్తి చేయాలి**

**వరంగల్ పశ్చిమ శాసనసభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి**



**కాజీపేట్, అక్షిత ప్రతినిధి :** వరంగల్ నగరాన్ని ఆదర్శ వంతమైన నగరంగా తీర్చిదిద్దే దిశగా రాష్ట్ర ప్రభుత్వం వేగంగా ముందుకు సాగుతోందని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వరంగల్ నగర అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించారని వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం వరంగల్ పశ్చిమ నియోజకవర్గ పరిధి లోని 50వ డివిజన్ సహకార్ నగర్, రెవెన్యూ కాలనీ, అలాగే 9వ డివిజన్ కాకతీయ కాలనీలోని సిక్కులవాడ ప్రాంతాల్లో సుమారు రూ.1 కోట్ల వ్యయంతో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, వరంగల్ నగరంలో అంతర్గత రహదారులు, డ్రైనేజీలు, తాగునీటి పైపులైన్లు, వీధి దీపాలు, ఇతర మౌలిక వసతుల అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికతో ముందుకు వెళ్తున్నామని చెప్పారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి వాటికి శాశ్వత పరిష్కారం చూపే దిశగా ప్రభుత్వం పనిచేస్తోందని పేర్కొన్నారు.

## ఎస్ఐఆర్ సర్వేలో తప్పుల్లేకుండా వివరాలు నమోదు చేయాలి: ఎమ్మార్వో స్రవంతి



**గరిడేపల్లి అక్షిత ప్రతినిధి..** సూర్యాపేట జిల్లా గరిడేపల్లి మండల కేంద్రంలో. పొనుగోడు గరిడేపల్లి గడ్డిపల్లి పలు గ్రామాలలో. తాహసిల్దార్ స్రవంతి పర్యటించారు ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. ఇంటింటా సర్వే మరియు వివరాల నమోదు ప్రక్రియను పరిశీలించిన ఆమె. ఈ సర్వేలో అర్హులైన ప్రతి ఒక్కరి వివరాలు సక్రమంగా నమోదయ్యేలా చూడాలని బీఎల్ఓ. లను ఆదేశించారు. ముఖ్యమైన వివరాలు ప్రక్రియ అర్హులైన ఓటర్లను చేర్చడం, మరణించిన వారిని లేదా వేరే ప్రాంతాలకు తరలిపోయిన వారి పేర్లను తొలగించడం, మరియు వివరాల సవరణ ఈ కార్యక్రమం యొక్క ముఖ్య ఉద్దేశ్యం.నిర్దేశం అధికారులు ఎటువంటి పొరపాట్లకు తావివ్వకుండా, పారదర్శకంగా ఈ నమోదు ప్రక్రియను పూర్తి చేయాలని ఎమ్మార్వో సూచించారు. ఓటరు నమోదు మరియు సవరణలకు సంబంధించిన పూర్తి వివరాలను, మార్గదర్శకాలను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల బిఎల్వోలు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలలను సందర్శించిన ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు



**అక్షిత ప్రతినిధి భూపాలపల్లి:** తెలంగాణలో ప్రభుత్వ విద్యను బలోపేతం చేయడానికి సీఎం రేవంత్ రెడ్డి ఎంతగానో కృషి చేస్తున్నారని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అన్నారు.. భూపాలపల్లి జిల్లా చిట్యాల మండలం నైన్ పాక గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలను భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు శుక్రవారం సందర్శించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పిలుపుమేరకు ప్రభుత్వ పాఠశాలలో ఎక్కువ సంఖ్యలో ప్రభుత్వ పాఠశాలలు ప్రారంభించి పిల్లలకు టిఫిన్,మధ్యాహ్నం భోజనం,స్నాక్స్ ఇస్తున్నామని తెలిపారు. కష్టపడి చదివి తల్లిదండ్రులకు పేరు తెచ్చే విధంగా విద్యార్థులు మంచిగా చదువుకోవాలన్నారు.. పిల్లలకు ప్రజా ప్రభుత్వంలో మెస్ చార్జీలు కాస్మోటిక్ ఛార్జీలు పెంచడం జరిగిందని,నియోజకవర్గంలో ఇంటిగ్రేటెడ్ స్కూల్ 200 కోట్లతో గాంధీనగర్ గ్రామంలో నిర్మించబోతున్నామన్నారు.. విద్యార్థులు మంచిగా చదువుకుని తప్పకుండా పుట్టిన గడ్డకు,రాష్ట్రానికి,గ్రామానికి తల్లిదండ్రులకు మంచి పేరు తేవాలన్నారు

## కదం తొక్కుతూ.. ఐక్యమత్యంతో ముందుకు వెళ్తూ..

**తండలల్లో కదిలిన ఉద్యమ దండు**

**పచ్చని పంట పొలాలు పండే పొలాల్లో చెత్తబుట్టలు వద్దు**

**ప్రజల ప్రాణాల కంటే మాకు ఏది గొప్పది కాదు**

**డంపింగ్ యార్డ్ వ్యతిరేక పోరాట కమిటీ చైర్మన్ ఎమ్మె సత్యనారాయణ**

**వై ఎం తాండ, పులిచెర్లకుంట తండాలలో భారీ ర్యాలీ**





**షాద్ నగర్, అక్షిత ప్రతినిధి:** పచ్చని పంటలు పండే పొలాల్లో చెత్తబుట్టలు వద్దు అని డంపింగ్ యార్డ్ వ్యతిరేక పోరాట కమిటీ చైర్మన్ ఎమ్మె సత్యనారాయణ ధ్వజమెత్తారు.సిద్దాపూర్ డంపింగ్ యార్డ్ ను వ్యతిరేకిస్తూ శుక్రవారం ఆయన వైయం తండా, పులిచెర్ల కుంట తండాలలో పర్యటించారు. మహిళలు యువకులతో కలిసి భారీ ర్యాలీ నిర్వహించి డంపింగ్ యార్డ్ వల్ల జరిగే అనర్థాలు, నష్టం గురించి వారికి వివరించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డంపింగ్ యార్డ్ వల్ల భవిష్యత్తు అంధకారం అవుతుందని అందుకు ఊరు, వాడ, తాండాలు ఏకం కావలసిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఐటీ పరిశ్రమలు ఏర్పాటు చేసి స్థానిక యువతకు ఉద్యోగాలు కల్పించమంటే డంపింగ్ యార్డ్ ను మా నెత్తిన గుదిబండగా మోపుతున్నారని వాపోయారు. రాజకీయాలు చేయడానికి మేము రాలేదని డంపింగ్ యార్డ్ వాళ్ళ జరిగే నష్టాలు మాత్రమే చెప్పేందుకు వచ్చామని అన్నారు.కాంగ్రెస్ నాయకులు డంపింగ్ యార్డ్ రాదు రానివ్వమని చెప్తున్నారని వారి మాటలు నమ్మి మోసపోవద్దని అన్నారు.జీవో నెంబర్ 641 ప్రభుత్వం డంపింగ్ యార్డ్ ఏర్పాటు చేస్తే విడుదల చేసిందని చెప్పారు.మనమంతా మేల్కొని డంపింగ్ యార్డ్ కు వ్యతిరేకంగా పోరాటం చేయాలని సూచించారు.డంపింగ్ యార్డ్ ను వ్యతిరేకించాల్సింది పోయి కనీసం వ్యతిరేకంగా పోరాటం చేస్తున్న మాకు మద్దతు తెలుపకుండా ఇంట్లో కూర్చుని మాట్లాడుతున్నారని విమర్శించారు.ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయ కులు వడ్డే బాలయ్య,వైయం తాండ మాజీ సర్పంచ్ అరుణ రమేష్ నాయక్, నరేందర్ రెడ్డి,ఎస్ బి పల్లి ఉప సర్పంచ్ సున్నాల గణేష్,బాబు రాజ్,శంకర్ నాయక్,రాందాస్ నాయక్,గోపాల్ నాయక్,బిచ్చా నాయక్,సంతోష్ నాయక్, భాస్కర్ నాయక్,జ్యోతి నాయక్, కుమ్మరిగూడెం పాండు,వడ్డే మల్లేష్,వడ్డే మహేష్,మన్నే లక్ష్మయ్య, జామకాయల కృష్ణయ్య,దండు తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

## విద్యారంగంలోని సమస్యలు పరిష్కరించాలి

**ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలో ఫీజు నియంత్రణ చట్టం అమలు చేయాలి**

**ఐక్య విద్యార్థి యువజన సంఘాల నాయకులు**







**కోదాడ అక్షిత ప్రతినిధి:** విద్యారంగ సమస్యల పరిష్కరించడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలం చెందిందని ఐక్య విద్యార్థి, యువజన సంఘాల నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా వామపక్ష విద్యార్థి సంఘాలు ఇచ్చిన రాష్ట్రవ్యాప్త బంద్ పిలుపులో భాగంగా కోదాడ పట్టణంలో విద్యాసంస్థల బంద్ నిర్వహించారు. ఈ సందర్భంగా పి డి ఎస్ యు జిల్లా ఉపాధ్యక్షులు పులి రాఖి, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి నరేష్, పి డి ఎస్ యు జిల్లా కార్యదర్శి చందర్రావు, ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి కొండల్, పివైఎల్ జిల్లా కార్యదర్శి డి రవి, టిఆర్ఎస్వి పట్టణ నాయకులు సాయి మాట్లాడుతూ రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చే ముందు విద్యార్థులకు అనేక హామీలు ఇచ్చి ఈరోజు విద్యార్థి వ్యతిరేక విధానాలు అవలంబిస్తూ విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడుతున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో 27 వేల ప్రభుత్వ పాఠశాలను కుదించి నాలుగు పాఠశాలలుగా ఏర్పాటు చేస్తానని స్వయన రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రకటించడం అంటే పేద విద్యార్థుల పట్ల ప్రభుత్వ పాఠశాల పట్ల ఎంత కుట్ర పన్నుతున్నారో అర్థం చేసుకోవాలని అన్నారు. రాష్ట్రంలోని ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థలో ఫీజుల పేరుతో వేలకు వేలు వసూలు చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం విద్యాహక్కు చట్టం ప్రకారం ఫీజు నియంత్రణ చట్టం అమలు చేయకుండా నిర్లక్ష్యం వహించడం దేనికి నిదర్శనం అని వారు ప్రశ్నించారు. ఫీజు నియంత్రణ చట్టం అమలు చేసి విద్య వ్యాపారాన్ని అరికట్టాలని వారు కోరారు. పెండింగ్లో ఉన్న స్కాలర్షిప్, ఫీజు రియంబర్స్మెంట్లను వెంటనే విడుదల చేయాలని, ప్రభుత్వ పాఠశాలలో ఉన్న మౌలిక సదుపాయాలు కల్పించాలని, ఖాళీగా ఉన్న అన్ని రకాల పోస్టు భర్తీ చేయాలని, విద్యార్థులకు అందించాల్సిన పాఠ్యపుస్తకాలు, 2 జతల దుస్తులు వెంటనే అందించాలని ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. లేనిపక్షంలో ఉద్యమాలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పి డి ఎస్ యు, ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్, పివైఎల్, బిఆర్ఎస్వి సంఘాల నాయకులు ఉదయ్ కిరణ్, రామకృష్ణ సురేష్ నవీన్ సతీష్ సైదులు పరమేష్ పరశురాం మహేష్ కళ్యాణి సంధ్య అనురాధ రేణుక తదితరులు పాల్గొన్నారు.